


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 08-07-2020 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 260 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నా



- ఆగష్టు 15 నాటికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నిర్ణయించాం
- నాణ్యమైన ఇసుక సరఫరా చేయాలి..
- రోజుకు దాదాపు 22-25 వేల కోవిడ్ టెస్టులు
- ప్రజల్లో చైతన్యం రావాలి
- స్పందన కార్యక్రమంపై సీఎం జగన్ సమీక్ష

తాడేపల్లి: పేదల ఇళ్ల పట్టాల కార్యక్రమానికి సుప్రీం కోర్టులో సానుకూల నిర్ణయం వస్తుందనే నమ్మకంతో ఉన్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. దురదృష్టవశాత్తూ టీడీపీ నాయకులు ఇళ్ల పట్టాలపై కోర్టులకు వెళ్లారని.. కరోనా వైరస్(కోవిడ్-19) కారణంగా కేసులు పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగష్టు 15 నాటికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆ రోజే పేదలకు కూడా స్వాతంత్ర్యం వస్తుందని అనుకుంటున్నట్లు వ్యాఖ్యానించారు.

అదే విధంగా డీ- పట్టాల కింద ఇవ్వాలనుకుంటే ఈ రోజైనా ఇవ్వొచ్చని, అయితే డీ- పట్టాల రూపంలో కాకుండా రిజిస్ట్రేషన్ చేసి అక్కాచెల్లెమ్మలకు ఇవ్వగలిగితే వారికి ఆస్తి ఇచ్చినట్టు అవుతుందని సీఎం జగన్ పేర్కొన్నారు. మంచి ఆలోచనతో పని చేస్తున్నామని.. ఎల్లప్పుడూ ధర్మమే గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్పందన కార్యక్రమంపై సీఎం జగన్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇళ్ల పట్టాలు, ఇసుక, ఉపాధి హామీ పనులు, కోవిడ్-19 నియంత్రణ చర్యలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో చర్చించారు. ''ఏపీలో 20 శాతం మంది జనాభాకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. 30 లక్షల మందిని ఇళ్ల యజమానులుగా చేస్తున్నాం. మంచి కార్యక్రమాన్ని దేవుడు ఎప్పటికైనా దేవుడు ఆశీర్వదిస్తాడు. ఇళ్ల పట్టాల కింద 62వేల ఎకరాలు సేకరించాం. పేదల ప్రజల పేరుతో రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. ప్రైవేటు భూముల కొనుగోలుకే సుమారు రూ.7500 కోట్లు ఖర్చుచేశాం. మొత్తంగా దాదాపు రూ.20వేల కోట్ల విలువైన ఆస్తిని 30 లక్షల కుటుంబాలకు ఇవ్వబోతున్నాం. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ కూడా ఇలా జరగలేదు.

గత ప్రభుత్వం హయాంలో ఐదేళ్లలో 3.5 లక్షల ఇళ్లు మాత్రమే కట్టారు. అందులోనూ రూ. 1300 కోట్లు బకాయిలు పెట్టారు. అర్బన్

తరువాయి 2లో..

# అర్హులైన ప్రతి నిరుపేదకు పక్కా ఇళ్ళు

విశాఖపట్నం : నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం ఆగస్టు 15వ తేదీన ఏర్పాటు చేసే ఆలోచనలో రాష్ట్రప్రభుత్వం ఉన్నదని, రిజిస్ట్రేషన్ కి సంబంధించి పట్టా డాక్యుమెంట్లో ఫొటో తో పాటు, ప్లాట్ నం, బౌండరీలు తదితరాల నన్నిటిని పొందుపర్చా లని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హౌస్ సైట్ లు, శాండ్, కోవి డ్-19, ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సమీక్షించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ లే-అవుట్లు వేసే ప్రక్రియ వేగవంతం చేయాలని , ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. అర్హులై ఉండి ఇళ్ళ స్థలం రానివారు దరఖాస్తు చేసుకున్న నిర్ణీత గడువు 90 రోజుల లోపల ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇసుక సేకరణకు సంబంధించి రానున్న పది రోజుల్లోగా జిల్లాలకు అవసరమైన నాణ్యమైన ఇసుకను సేకరించి కొరత లేకుండా నిల్వ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ అభివృద్ధి పనులు. హౌసింగ్, స్కూల్ భవనాలు , నాడు-నేడు, అర్ బీ కే, ఇరిగేషన్ పనులపై దృష్టి పెట్టాలన్నారు. ఉపాధి హామీ పనులు మూడు నెల ల్లో ఎనిమిది కోట్ల పనిదినాలు కల్పించి కరోనా కష్ట కాలంలో నిరు పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించిన కలెక్టర్ లను అభినందిస్తున్నానన్నారు. గ్రామ సచివాలయాలు,

తరువాయి 2లో..



# గ్యాస్ ప్రభావిత ప్రాంత ప్రజలకు అన్ని రకాల వైద్యం

## - వెంకటాపురం గ్రామంలో ఆసుపత్రి ప్రారంభం - పర్యాటక శాఖ మంత్రి



విశాఖపట్నం : ఎల్జీ పాలిమర్స్ ప్రమాద బాధిత గ్రామాల ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం వెంకటాపురం గ్రామం లో శాశ్వత ప్రాతిపదికన ఆస్పత్రిని త్వరలో నిర్మించడం జరుగుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం నాడు ఆయన వెంకటాపురం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటుచేసిన 12 బెడ్ల ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజీ ఘటన బాధిత గ్రామాల ప్రజల ఉపయోగార్థం ఈ ఆసుపత్రిని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ ఘటనపై హైపవర్ కమిటీ నివేదిక సూచనల మేరకు రాష్ట్రంలోని ప్రమాదకర కంపెనీల వలన ప్రజలకు ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మేఘాద్రి గడ్డ రిజర్వాయర్ నీటి వినియోగం పై నీరి సంస్థ నివేదిక ప్రకారం వ్యవహరిస్తా మన్నారు.

అనంతరం వెంకటాపురం గ్రామంలో జీవీఎంసీ తరఫున రూ.65 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాలు, డ్రైన్ల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ జి. సృజన, జాయింట్ కలెక్టర్ అరుణ్ బాబు, ఆర్ డి ఓ పి.కిషోర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి తిరుపతిరావు, ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్, ఇతర అధికారులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.





# ఇడుపులపాయ చేరుకున్న సీఎం వైఎస్ జగన్

## నేడు వైఎస్సార్ జయంతి సందర్భంగా వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించనున్న సీఎం జగన్

వైఎస్సార్ జిల్లా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప చేరుకున్నారు. వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన ఆయన కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రికి ఇంచార్జ్ మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్ హరికిరణ్, కర్నూల్ రేంజ్ డీఐజీ, విప్ కొరముట్ల

తరువాయి 2లో..



# నీటి సమస్యను పరిష్కరించాలి

భీమునిపట్నం: స్థానిక చిన్నబజార్ అప్పికొండ వీధి కొండపై ఉన్న సుమారు రెండు వందల కుటుంబాలు ప్రతీ రోజూ ఇంట్లో వాడుకోవటానికి నీరు దొరక్క అవస్థలు పడుతున్నామని అక్కడ ప్రజలు బీజేపీ నాయకులు కంటుభుక్త రామానాయుడు, మూడవ వార్డు బీజేపీ-జనసేన కార్పొరేటర్ అభ్యర్థి శ్రీమతి కంటుభుక్త సునీత లను కలిసి తమ గోడు వినిపించారు.

తాము మునిసిపల్ కుళాయి కనెక్షన్ తీసుకున్నప్పటికీ రోజు తప్పించి రోజు అది కేవలం 20 నిముషాలు పాటు మాత్రమే కుళాయి ద్వారా నీరు ఇవ్వడం వలన వాడకానికి కూడా సరిపోవడం లేదని, కుళాయి ద్వారా వచ్చే నీరు తాగడానికి వీలుగా లేకున్నా ఇంటి అవసరాలకు వాడుకోవడానికి కూడా ప్రతీ రోజూ నీరు రాకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఒక వేళ టాంకర్ తో కొండ క్రింది భాగంలో ఉన్న ప్రాంతానికి నీరు వచ్చినా కేవలం ఒక బకెట్ నీరు మాత్రమే కొండ పైనున్న ఇళ్లకు తీసుకెళ్లగలుగుతున్నామని తెలిపారు. ఈ సమస్య తీరాలంటే కొండ మీద ఉన్న వాటర్ పైప్ లైన్ నుంచి నీరు వచ్చేటప్పుడు కొండ మీద వాటర్ ట్యాంక్ ను నిర్మించి ఆ ట్యాంక్ ను నింపి కుళాయి రాని రోజున ఆ ట్యాంక్ ద్వారా కుళాయి లోంచి వచ్చేటట్లు చేస్తే వారికి నీటి సమస్య తీరుతుందని చెప్పారు. దీనికి బీజేపీ నాయకులు రామానాయుడు స్పందిస్తూ తన దృష్టికి వచ్చిన ఈ నీటి సమస్యను జీవీఎంసీ భీమిలి జోనల్ కమీషనర్ దృష్టికి, జీవీఎంసీ కమీషనర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ సమస్యకు మూడు నెలలలో శాశ్వత పరిష్కారంగా కొండ మీద ట్యాంక్ నిర్మించకుండా తాత్సారం చేస్తే అవసరం అయిన అనుమతులు తీసుకొని తన సొంత నిధులతో ట్యాంక్ ని నిర్మించి ఆ 200 కుటుంబాల నీటి సమస్యను తీరుస్తానని రామానాయుడు అన్నారు.

## కేజీబీ లో ప్రవేశాలకు ఆఖరు తేదీ ఈనెల పదిహేను

భీమునిపట్నం : స్థానిక కృష్ణా కోలని లో ఉన్న కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరో తరగతి లో ప్ర వేశాలకు దరఖాస్తులు పెట్టుకోవాలని విద్యాలయం ప్రత్యేక అధికారిని గ్రెస్ లిల్లీ తెలియజేసారు.

అర్హత కలిగిన ఆసక్తిగల విద్యార్థినులు ఈ నెల పదిహేను లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ దరఖాస్తులను నేరుగా కస్తూరిభా గాంధీ బాలికల విద్యాల యంలో అందజేయాలని అన్నారు. ఆరవతరగతి 40, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40సీట్లు కాళీ ఉన్నాయని ఆమె తెలిపారు.

## మాతృభూమి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా కొర్రాయి తేజ ఆశిష్



భీమునిపట్నం: మాతృభూమి ఫౌండేషన్ ద్వారా సేవలు చేస్తునందుకు గాను గత ఐదు సంవత్సరాలు గా చేస్తున్న కృషికి మాతృభూమి ఫౌండేషన్ విశాఖపట్నం సభ్యుడు అయిన కొర్రాయి తేజ ఆశిష్ కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు గా ఎంపికయ్యాడు ఆదివారం మాతృభూమి ఫౌండేషన్ ఫౌండర్ కొతారి కిరణ్ తెలిపారు .అలానే విశాఖ జిల్లా ఇన్ ఛార్జ్ మరియు సలహాదారులుగా నమ్మి రమేష్, నమ్మి గోవింద్ లను.అలానే మరికొందరికి జిల్లా కి సంబంధించిన అభ్యర్థులు గా ఎంపిక చేసారని వెల్లడించారు. ఈ సందర్భంగా కొర్రాయి తేజ ఆశిష్ మాట్లాడుతూ ప్రజాసేవ లో మమ్మ లన్నీ గుర్తించి ఇంతవరకు నన్ను మా సభ్యులని ప్రోత్సహించిన కిరణ్ కి ధన్యవాదాలు తెలియజేశారు.

అలానే అన్ని విధాలా సహాయసహకారాలు అందించిన, వెల్లంకి గ్రామ ప్రజలకి నాయకులకి, యువతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మాకు ఇచ్చిన ఈ బాధ్యతని సక్రమంగా నిర్వహిస్తానని వెల్లడించారు.

## కరోనా వివక్ష పై క్రిమినల్ కేసు నమోదు

శ్రీకాకుళం : కరోనా మృతదేహం దహన సంస్కారాలు చేసారని వివక్ష చూపిన 10 మంది వ్యక్తులపై జిల్లాలో క్రిమినల్ కేసు నమోదు జరిగింది. వివరాలు పరిశీలిస్తే శని వారం మెళియాపుట్టి గ్రామంలో ఒక వ్యక్తి మృతి చెందారు. మృతదేహానికి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ గా నిర్ధారణ జరిగింది. మృతదేహానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం దహన సంస్కారాలు నిర్వహించుటకు ఏర్పాట్లు చేసారు. ఈ క్రమంలో టెక్కలికి చెందిన కొంత మంది పారిశుధ్య కార్మికులను అధికారులు మెళియాపుట్టి రప్పించి సదరు కార్యక్రమాన్ని నిర్వహించుటలో భాగస్వామ్యం కావాలని కోరారు.

కోవిడ్ మరణం దృష్ట్యా దహన సంస్కారాల్లో పాల్గొనలేమని కార్మికులు తెలియజేసారు. అయితే మెళియాపుట్టి పోలీసు సబ్ ఇన్స్పెక్టర్, పంచాయతీ కార్యనిర్వాహన అధికారి దహన సంస్కారాలు చేసే విధానం వివరించి వ్యక్తిగత రక్షణ కిట్ల సహాయంతో చేయడం వలన ఎటువంటి ప్రమాదం ఉండదని, సురక్షితంగా ఉండవచ్చని తెలియజేయడంతో మానవతా దృక్పధంతో పాల్గొన్నారు.

దహన సంస్కారాలు అనంతరం స్వగ్రామానికి తిరిగి రాగా గ్రామస్తులు కుటుంబాలతో ఉన్నామని, వీధిలోకి రావడానికి లేదని తేల్చిచెప్పడమే కాకుండా వివక్షతతో తగాదాకు దిగారు. పారిశుధ్య కార్మికులు చేసేది లేక వెనుదిరిగి ఖాళీగా ఉన్న ఒక భవనం వద్దకు వచ్చి వరండాలో తలదాచుకున్నారు. ఈ విషయంపై పోలీసు స్టేషన్ లో పిర్యాధు చేయగా ఐపిసి 341, 188 సెక్షన్లు., విపత్తులన యాజమాన్య చట్టం సెక్షన్ 51(బి) క్రింద 10 మందిపై క్రిమినల్ కేసును నమోదు చేసారు. జిల్లా యంత్రాంగం కూడా తీవ్రంగా పరిణమించింది. జిల్లా కలెక్టర్ జె నివాస్ వివక్ష చూపరాదని పలుమార్లు హెచ్చరించిన సంగతి విధితమే. కరోనా వ్యక్తులపైనా ముఖ్యంగా మృతదేహాల దహన సంస్కారాలలో పాల్గొన్న వారిపై వివక్ష చూపించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. వివక్ష చూపించడం అమానుషమని పేర్కొన్నారు. పిపిఇ కిట్లు ధరించడం ద్వారా సురక్షితంగా ఉండవచ్చని ఆయన చెప్పారు. ఎటువంటి సమస్య ఉండదని ఆయన తెలిపారు.

## విఆర్ఓలకు పదోన్నతులు

శ్రీకాకుళం : జిల్లాలో గ్రామ రెవిన్యూ సహాయకులకు పదోన్నతులు కల్పించడం జరిగిందని జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 198 మంది వి.ఆర్.ఓలు గ్రామ రెవిన్యూ అధికారులుగా పదోన్నతి పొందారని చెప్పారు. పదోన్నతి పొందిన పోస్టులో 15 రోజుల్లో చేరాలని ఆయన పేర్కొన్నారు. పదోన్నతి పోస్టులో రెండు సంవత్సరాలపాటు ప్రొబేషన్ కాలం ఉంటుందని, ప్రొబేషన్ కాలం పూర్తి చేసుకున్నవారికి రెగ్యులర్ టైమ్ స్కేల్ కు పరిగణించడం జరుగుతుందని ఆయన చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

## సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నా

హౌసింగ్‌లో 7 లక్షల ఇళ్లు కట్టాలనుకున్నారంట. కేవలం 3లక్షల ఇళ్లు మాత్రమే కట్టడం మొదలుపెట్టారు. అవి కూడా సగంలో ఆపేశారు. ఇందుకు సంబంధించిన బకాయిలు రూ.3వేల కోట్ల రూపాయలు. పేదలకు ఇళ్లను కట్టించాల్సిన ప్రభుత్వం.. ఇంత దారుణంగా వ్యవహరించింది. కానీ, ఇవాళ 30లక్షల మందికి రిజిస్ట్రేషన్ చేయించి 15 లక్షల ఇళ్లు కట్టడానికి అన్నిరకాలుగా సిద్ధమవుతున్నాం. ఇవన్నీకూడా ఇళ్లపట్టాలు ఇచ్చిన నెలరోజులకే ప్రారంభిస్తాం. గతానికి ఇప్పటికీ తేడా చాలా ప్రస్ఫుటంగా కనిపిస్తోంది'' అని పేర్కొన్నారు.

**వారికి 90 రోజుల్లోనే పట్టా ఇవ్వాలి..**

కలెక్టర్లు ఈ పురోగతిని, కార్యక్రమంలో ముందడుగు వేసే తీరును వదిలిపెట్టవద్దు. కార్యక్రమం వాయిదా పడిన నేపథ్యంలో మరింత మెరుగ్గా పని చేయాలని.. ఈ పథకంపై మరింత దృష్టి సారించాలని కలెక్టర్లను కోరుతున్నా. లే అవుట్లలో చెట్లను నాటించే కార్యక్రమాలు చేపట్టాలి. పట్టా డాక్యుమెంట్లలో ఫొటోలు పెట్టడం, ఫ్లాట్ నంబర్ , హద్దులు పేర్కొనడం చేయాలి. ఈ టైం గ్యాప్‌ను సద్వినియోగంచేసుకోవాలి. చాలా సునాయాసంగా రిజిస్ట్రేషన్ చేయించడం దీనివల్ల వీలవుతుంది. ఇళ్లపట్టాల లబ్ధిదారుల జాబితాను ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల్లో డిస్‌ప్లే చేయండి. ఇంకా ఎవరైనా కూడా అర్హత ఉండి పొరపాటున రాకపోతే.. దరఖాస్తు చేస్తే, ఎంక్వైరీ చేసిన తర్వాత 90 రోజుల్లోనే పట్టా వారికి ఇవ్వాలి. జాబితాలో ఎవరిపేరైనా లేకపోతే వారిచేత దరఖాస్తు చేయించాలి.

**నాణ్యమైన ఇసుక సరఫరా చేయాలి..**

ఇప్పటికే వర్షాలు బాగా మొదలయ్యాయి. రీచ్‌ల్లోకి నీరు చేరుతోంది. వచ్చే వారం పది రోజుల్లోగా కావాల్సిన ఇసుకను స్టాక్ చేయాలి. ఇసుకకు సంబంధించి బాధ్యతలు తీసుకుంటున్న జాయింట్ కలెక్టర్లు ప్రభుత్వ కార్యక్రమాల మీద దృష్టిపెట్టాలి. మనకు పనులు చేసుకునే సమయం చాలా స్వల్పంగా ఉంది. హౌసింగ్ గాని, ఆర్బీకేలు కాని, స్కూలు భవనాలకు సంబంధించి నాడు%--%నేడు పనులు కాని.. వీటన్నింటిపైనా జాయింట్ కలెక్టర్లు ధ్యాసపెట్టాలి. ఉభయ గోదావరి, గుంటూరు జిల్లా కలెక్టర్లు ఇసుక డిమాండ్ బ్యాక్‌లాగ్‌ను వెంటనే క్లియర్ చేయాలి. వచ్చే 10 రోజుల్లోగా స్టాక్ యార్డుల్లో పెద్ద ఎత్తున నిల్వచేయాలి. నాణ్యమైన ఇసుకను కూడా సరఫరా చేయాలి. నాణ్యమైన ఇసుకను పంపిణీ చేయలేకపోతే కలెక్టర్లు, జేసీలకు చెడ్డపేరు వస్తుంది. ప్రభుత్వం వద్ద కూడా మీకు చెడ్డపేరు వస్తుంది. లెక్టర్లు చర్యలు తీసుకుని బ్యాక్‌లాగ్ తీర్చడంతోపాటు, స్టాక్ యార్డుల్లో పూర్తిగా నిల్వచేయాలి. ఇసుక కొరత ఉందనే మాట నాకు వినిపించకూడదు.

**రోజుకు దాదాపు 22-25 వేల కోవిడ్ టెస్టులు**

''రెండు మూడు టెస్టులు కూడా చేయడానికే ఇబ్బంది పడే పరిస్థితి మారిపోయి ఇప్పుడు ఏకంగా రోజుకు సగటున 22-25వేల టెస్టులు చేయగలుగుతున్నాం. ఇప్పటివరకూ 10లక్షలకు పైగా టెస్టులు చేయగలిగాం. అధికారులకు, కలెక్టర్లకు అభినందనలు. హోం ఐసోలేషన్ చాలా ముఖ్యమైన అంశం. 85శాతం కేసులకు ఇంట్లోనే నయం అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి. హోం ఐసోలేషన్‌కు రిఫర్ చేసే వారికి బాగా చూసుకుంటున్నామా లేదా మందులు సరిగ్గా అందుతున్నాయా లేదా అని పర్యవేక్షించాలి. గ్రామ సచివాలయంలో ఉన్న హెల్త్‌అసిస్టెంట్, ఆశావర్కర్, ఏఎన్ఎం, అలాగే జిల్లా స్థాయిలో ఉన్న కోవిడ్ కంట్రోల్ రూం బాగా పనిచేయాలి ఈ యంత్రాంగం మెరుగ్గా పనిచేయాలి. హోం ఐసోలేషన్ మీద కలెక్టర్లు దృష్టిపెట్టాలి. హోం ఐసోలేషన్‌కోసం ఇండివిడ్యువల్‌గా ఇంట్లో ప్రత్యేక గది లేని వారికోసం కోవిడ్‌కేర్ సెంటర్లు పెట్టాం. ఈ కోవిడ్ కేర్ సెంటర్లలో నాణ్యమైన సేవలమీద దృష్టిపెట్టాలి. వారికిచ్చే ఆహారం, బాత్‌రూం, బెడ్ల నిర్వహణ మీద దృష్టిపెట్టాలి. వైద్యులు పర్యవేక్షణ బాగుందా లేదా అలాగే మందులు ఇస్తున్నారా లేదా ఆ మందులను కూడా జీఎంపీ ప్రమాణాలు ఉన్నవి ఇస్తున్నారా లేదా అన్న దాని మీద కలెక్టర్లు దృష్టిపెట్టాలి. అలాగే రాష్ట్ర స్థాయి కోవిడ్ ఆస్పత్రులు, జిల్లాల్లోని కోవిడ్‌ఆస్పత్రుల్లో క్వాలిటీ మీద దృష్టిపెట్టాలి.

**ప్రజల్లో చైతన్యం రావాలి**

బెడ్లు, బాత్‌రూమ్స్, మెడికేషన్, ఆహారం ఈ నాలుగు అంశాల మీద అధికారులు దృష్టిపెట్టాలి. కోవిడ్ సెంటర్లలో నాణ్యతమీద దృష్టిసారించాలి. కోవిడ్‌తో కలిసిబతకాల్సిన సమయం. వ్యాక్సిన్ కనుగొనేంత వరకూ... మనం జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే అనుమానితులకోసం కూడా ఇస్తున్న క్వారంటైన్ సదుపాయాలు కూడా బాగుండాలి. దేశంలో అన్ని రాష్ట్రాల సరిహద్దులు తెరిచారు. అలాగే కొన్నిచోట్ల నుంచి అంతర్జాతీయ విమానాలు కూడా నడుస్తున్నాయి. దీని వల్ల సహజంగానే కేసులు పెరుగుతాయి. అంతమాత్రాన ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

కానీ, కేసులు ఉన్నప్పుడు ప్రజల్లో ఉన్న భయాందోళన తొలగిపోయి వారిలో చైతన్యం రావాల్సిన అవసరం ఉంది.కోవిడ్ సోకినా , కోవిడ్ లక్షణాలు కనిపించినా.. ఒక వ్యక్తి ఎవరికి కాల్ చేయాలి? ఏం చేయాలి? ఎక్కడకు వెళ్లాలి? అన్నదానిపై తెలియాలి. ప్రజలందరికీ కూడా ఈ మూడు విషయాలు తెలియజేయాలి. దీనివల్ల ప్రజలు వైద్యం చేయించుకోవడం సులభం అవుతుంది. ప్రజల్లో చైతన్యం కలిగించడం మీద దృష్టిపెట్టాలి. మనం సహాయం కోసం ఇచ్చే కాల్ సెంటర్ నంబర్లు , టెలిమెడిసిన్, 108 లాంటి నంబర్లు.. సమర్థవంతంగా పనిచేయాలి. డమ్మీ చెకప్స్ కూడా చేయండి. మన పనితీరును కూడా మనం సమీక్ష చేసుకుని. లోపాలు ఉంటే సరిదిద్దుకోవాలి.

# ఘనంగా బొడ్డేపల్లి విగ్రహావిష్కరణ



శ్రీకాకుళం : పార్లమెంటరీ నియోజకవర్గం మాజీ పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహావిష్కరణ కార్యక్రమం మంగళ వారం ఘనంగా జరిగింది. కిమ్స్ ఆసుపత్రి రహదారిలో ఇంటాక్ ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ జరిగింది. రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన క్రిష్ణదాస్, శాసన సభ్యులు ధర్మాన ప్రసాద రావు సమక్షంలో రాష్ట్ర శాసన సభాపత్రి తమ్మినేని సీతారం విగ్రహావిష్కరణ చేసారు. బొడ్డేపల్లి రాజగోపాల రావు ఆమదాలవలస మండలం అక్కులపేట లో 1923వ సంవత్సరం జన్మించారు. భూములు తన హయాంలో అన్ని స్వచ్ఛందంగా పేద రైతులకు ఉచితంగా పంపిణీ చేసిన దానగుణం కలవాడు రాజగోపాలరావు. 1952 నుండి 1984 వరకు 6 సార్లు శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గానికి పార్లమెంటు సభ్యులుగా ఎన్నికయ్యారు. దక్షిణ భారతదేశానికి ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా వ్యవహరించారు. కళింగ కులస్తులను విముక్త జాతిగా మద్రాసు ప్రెసిడెన్సీ గుర్తించేటట్లు ఒప్పించి గజిట్ నోటిఫై చేయడం, నీతి నిజాయితీలు పరమావధిగా తన రాజకీయ ప్రస్థానంలో శ్రీకాకుళం జిల్లాను ముందుండి నడిపించారు. వంశధార వంటి ఎన్నో నీటిపారుదల పథకాలు చేపట్టి త్రాగునీరు, సాగునీరు సమస్యలను తీర్చారు. అమదాలవలస షుగర్ ఫ్యాక్టరీని స్థాపించి చెరుకు సాగు చేసే రైతులకు ప్రోత్సాహం కల్పించారు. చింతాడ, రాగులు, బారువలలో వ్యవసాయ పరిశోధన సంస్థలు స్థాపించి రైతు భాందవుడిగా నిలిచారు. పొందూరులో జ్యూట్, నూనె, చేనేత పరిశ్రమలు స్థాపించారు. శ్రీకాకుళం జిల్లాలో పారిశ్రామికవాడ నిర్మాణం చేపట్టి భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమల స్థాపనకు రావటానికి మార్గము చూపిన వ్యక్తి. శ్రీకాకుళం రైల్వే స్టేషన్ నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీల నాయకత్వంలో సమకాలీన రాజకీయ నాయకునిగా పనిచేసారు. ఉమ్మడి జిల్లాలో ఉన్నటువంటి గరివిడి ఫేకర్ స్థాపనకు చేయూత నిచ్చి ఉపాధి కల్పనకు దోహద పడ్డారు. అప్పటి ఒరిస్సా ముఖ్యమంత్రి శ్రీమతి నందిని శతపతిని కూడా స్వగ్రామం నకు తీకుసువచ్చి ఆడపడుచుగా పదుల సంఖ్యలో ఒంగోలు జాతి పాడి ఆవులు బహుమతిగా ఇచ్చిన శ్వేత విప్లవకారుడు. అనేక చిన్న మధ్యతరహా ప్రాజెక్టుల రూపకల్పన చేసి గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అనేక రకాలుగా వారి యొక్క సేవలను అందించారు. ఆమదాలవలసలో రామమందిరానికి అనుబంధంగా శాశ్వత అన్నదాన సమాజం ఏర్పాటు చేసి మానవ సేవే మాధవ సేవ ప్రతీక. ఎస్సీ, ఎస్టీ మైనారిటీల అభ్యున్నతికి కృషి చేసారు. రాష్ట్ర శాసన సభాపత్రి తమ్మినేని సీతారం మాట్లాడుతూ బొడ్డేపల్లి రాజగోపాల రావు ఆదర్శప్రాయమైన వ్యక్తి అని, చిరస్మరణీయుడు అని అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం అనునిత్యం తపనపడిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఆమదాలవలస సుగర్ ఫ్యాక్టరీతో జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి భీజం వేసి వ్యక్తి అన్నారు. వంశధార కోసం ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూను కలసి సాగు నీరు, రైతు ప్రాధాన్యతను గూర్చి తెలియజేసి వంశధార ఎడమ, కుడి కాలువల ద్వారా నీటి సరఫరాకు చర్యలు చేపట్టి జిల్లాకు వెన్నెల వెలుగులు నింపారని కొనియాడారు. జలమై, జీవమై ప్రజల గుండెల్లో నిలిచారని చెప్పారు. అవినీతికి తావులేకుండా విశాల దృక్పధంతో పనిచేసారాని అన్నారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేసారని తెలిపారు. ఒక ఎన్నికలో రాజగోపాల రావుతో పోటీ పడి గెలుపొందడం గొప్ప విషయమని, నా చరిత్రలో అదొక అధ్యాయం అన్నారు. ఓటమిని హుందాగా స్వీకరించిన నాయకుడు అన్నారు. చనిపోయినా, ప్రజల గుండెల్లో బ్రతికి ఉండే వాడే నిజమైన నాయకుడు అన్నారు. పాలకొండ రోడ్ కు, బలగ పాఠశాలకు, నాలుగు రోడ్ల కూడలికి రాజగోపాల రావు పేరు పెట్టాలని పలువురు వక్తలు కోరారు.

ఈ కార్యక్రమంలో డిసిసిబి అధ్యక్షులు పాలవలస విక్రాంత్, జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి, ఇంటాక్ కన్వీనర్ కెవిజె రాధాప్రసాద్, రెడ్ క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జగన్మోహన రావు, మాజీ కేంద్ర మంత్రి డా.కిల్లి కృపారాణి, మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ పురపాలక అధ్యక్షులు అంధవరపు వరం, ఎం.వి.పద్మావతి, ఇంటాక్ సభ్యులు సురంగి మోహన రావు, నూక సన్యాసిరావు, నటుకుల మోహన్, కళింగ సేవా సమితి అధ్యక్షులు హనుమంతు కృష్ణారావు, సభ్యులు చింతాడ రామ్మోహన రావువు, హనుమంతు కిరణ్ కుమార్, చౌదరి సతీష్, డా.దానేటి శ్రీధర్, దుప్పల వెంకట రావు, కణితి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



## యానాంలో మరో 8 పాజిటివ్ కేసులు నమోదు

యానాం : కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో మంగళవారం మరో ఎనిమిది పాజిటివ్ కేసులు నమోదు కావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు స్థానికంగా కరోనా మహమ్మారి యానాం నియోజకవర్గ దరిచేరకుండా ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు, పరిపాలనా అధికారి శివరాజ్ మీన, అధికారులు పోలీసులు కఠినమైన చర్యలు చేపట్టి ఈ ప్రాంతంలోకి ఇతరులు ఎవరు రాకుండా నిబంధనలతో ఇబ్బందులు పెట్టినప్పటికీ ఈ మహమ్మారిని ఆపటం ఎవరి తరం కాలేదు మొదటగా ఒక బాలుడికి సోకి ఇరవై రోజుల వ్యవధిలోనే 23 కి మంది కి పాజిటివ్ రావడం గమనార్హం కరోనా రక్కసి విలయ తాండవం చేసే ప్రమాదం పొంచివుందని అధికారులు సూచిస్తున్నా ప్రజలు నిబంధనలు పాటించకపోవడం వల్లే ఈ కరోనా మహమ్మారి విలయతాండవం చేయటానికి కారణం అవుతుంది.

## అర్హులైన ప్రతి నిరుపేదకు పక్కా ఇళ్ళు

అర్ బీ కే లు, వై ఎస్ ఆర్ క్లినిక్స్, అంగన్వాడీ కేంద్రాలు, నాడు-నేడు నిర్మాణాలకు సంభందించి స్థలాలను గుర్తించాలన్నారు.

కోవి డ్-19 కి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకూ పది లక్షల టెస్ట్ లు చేయించిన జిల్లా యంత్రాంగా న్నిఅభినంది స్తున్నానన్నారు. క్వారంటైన్ ఫెసిలిటీస్ బాగుండాలని,కోవిడ్ కేర్ సెంటర్ లలో బెడ్స్, పరిశుభ్రమైన టాయిలెట్స్, నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. వీటన్నిటి పై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలక్టర్ వినయ్ చంద్ ,జాయింట్ కలక్టర్ వేణు గోపాల్ రెడ్డి, రూరల్ ఎస్ పీ బీ కృష్ణా రావు తదితరులు హాజరయ్యారు.

## ఇడుపులపాయ చేరుకున్న సీఎం వైఎస్ జగన్



శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రవీంద్రనాధ్ రెడ్డి, రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, సుధీర్ రెడ్డి, కడప పార్లమెంట్ అధ్యక్షుడు సురేష్ బాబు ఘనస్వాగతం పలికారు. ఇడుపులపాయకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ముఖ్యమంత్రి పయనమయ్యారు. నేడు వైఎస్సార్ జయంతి సందర్భంగా ఇడుపులపాయలో వైఎస్సాఆర్ ఘాట్ వద్ద సీఎం వైఎస్ జగన్, ఆయన సతీమణి భారతి నివాళులర్పించనున్నారు.

అనంతరం ట్రిపుల్ ఐటీ వద్ద వైఎస్సార్ విగ్రహావిష్కరణతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు. తిరిగి సాయంత్రం విజయవాడ చేరుకోనున్నారు.

# కక్ష సాధింపు కోసమే రవీంద్రను హత్య కేసులో ఇరికించారు

## - బీసీల పై కక్ష సాధింపు అనడానికి మాజీ మంత్రులపై కేసులే నిదర్శనం

## - మాజీ మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబాన్ని పరామర్శించిన వాసుపల్లి



విశాఖ అర్బన్: తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, విశాఖ దక్షిణ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ , జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సూచన మేరకు సహచర మత్స్యకార మాజీ శాసనసభ్యులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అరెస్టుపై వారి కుటుంబమును పరామర్శించారు. ప్రాథమిక విచారణ కూడా జరపకుండానే అరెస్ట్ చేయడం వైసీపీ కక్ష సాధింపు చర్యలకు నిదర్శనమన్నారు. కేవలం కక్ష సాధింపు కోసమే రవీంద్రను హత్య కేసులో ఇరికించారని ఆరోపించారు. ఎమర్జెన్సీ సమయంలో కూడా ఇన్ని ఆరాచకాలు జరగలేదని, ఇంతమంది నేతలను జైళ్లకు పంపించలేదన్నారు. బీసీలపై వైసీపీ పగ పట్టిందని చెప్పడానికి అచ్చెన్నాయుడు, యనమల,అయ్యన్న పాత్రుడు, కొల్లు రవీంద్రలపై తప్పుడు కేసులే నిదర్శనమన్నారు. రవీంద్ర అరెస్టును టీడీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇప్పటికే రాష్ట్ర పారిశ్రామికవేత్తలు వలస కూలీల వలే వలస పోతున్నారు.

అని, ఇదే పంథాలో ప్రభుత్వం కొనసాగితే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి అవుతుందని, జగన్ మోహన్ రెడ్డి ఇప్పటికైనా కక్ష సాధింపు చర్యలు మానుకొని రాష్ట్ర అభివృద్ధి కోసం ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఒక మత్స్యకార నాయకుడి అరెస్ట్ వెనుక ప్రభుత్వం ఎంత డ్రామా నడిపిందో ప్రజలు అందరు గమనిస్తున్నారు అని తెలియజేసారు. తెలుగు దేశం పార్టీ ఎప్పుడు రవీంద్ర మరియు వారి కుటుంబానికి బాసటగా ఉంటుందని, నారా చంద్రబాబు నాయుడు సూచనలు మేరకు రాజమండ్రి జైలుకు కూడా వెళ్లి రవీంద్రను కలవడానికి ప్రయత్నించామని ప్రభుత్వ అనుమతి లభించని కారణంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## శ్రీ శ్రీ శ్రీ కుంచుమాంబ అమ్మవారి ఆలయం నిర్మాణంనకు లక్ష రూపాయుల విరాళం



గాజువాక : 86వ వార్డు పరిధి దువ్వాడ సెక్టర్ -2 లో వెలిసిన కుంచుమాంబ అమ్మవారి ఆలయం నిర్మాణంనకు లక్ష రూపాయుల విరాళంను మంగళవారం 86వార్డ్ వైసీపీ వార్డు కార్పోరేటర్ అభ్యర్ధీ దామా సుబ్బారావు అందజేసారు. దువ్వాడ సెక్టర్-2 గ్రామ పెద్దలకు లక్ష రూపాయుల నగదు అందజేసారు.

ఈ సందర్భంగా దామా సుబ్బారావు మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్ర దాయాల ఔన్నత్యాన్ని బావి తరానికి తెలియజేయవలసిన భాద్యత మనపై ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో గుండాసు వెంకట రమణ, శెట్టి సీతారామ్ , సిరసపల్లి అప్పారావు, సిరసపల్లి శ్రీనివాస్ రావు, రాపర్తి కనకరావు, గుండాసు రాజు, గుండాసు నానాజి, సిరసపల్లి సత్తిబాబు, గంట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఏడి ఫ్లైఓవర్ త్వరితగతిన పూర్తి కావాలి

## కాంట్రాక్టర్ విజయనిర్మాన్ కంపెనీ ప్రతినిధులతో వీఎంఆర్‌డీఏ ఛైర్మన్, కమిషనర్‌ల సమీక్ష




విశాఖపట్నం (ఎన్ఎడి కొత్తరోడ్డు) : మంగళవారం వీఎంఆర్డీఏ కార్యాలయంలో అధికారులు మరియు ఇపిసి కాంట్రాక్టర్ ప్రతినిధు లతో (విజయ్ నిర్మాన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్) వీఎంఆర్డీఏ ఛైర్‌పర్సన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు మరియు మెట్రోపాలిటన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు, ఐఏఎస్, ఎన్.ఎ.డి జంక్షన్ వద్ద చేపట్టిన ఫ్లై-ఓవర్ (ఫైవంతెన) నిర్మాణం పనుల పురోగతి పై సమీక్షించారు.

ఇప్పటివరకు ఇపిసి కాంట్రాక్టర్ ప్రతినిధులు 60% భౌతిక పనులను పూర్తి చేసి 55% ఆర్ధిక పురోగతిని సాధించారని తెలియజేశారు. అధిక ట్రాఫిక్, లారీల సమ్మె, ఇసుక లభించకపోవడం మరియు కోవిడ్19 లాక్‌డౌన్ కారణంగా పనులలో ఆలస్యం కి కారణమని కాంట్రాక్టర్ ప్రతినిధులు పేర్కొన్నారని తెలిపారు.

**ఎగువ రోటరీ:**విమానాశ్రయం నుండి ఎన్ఎస్‌టిఎల్ వైపు రహదారి పూర్తయిందని మరియు ట్రాఫిక్ తెరవడానికి సిద్ధంగా ఉందని, గోపాలపట్నం వైపు పనులు పురోగతిలో ఉన్నాయని మరియు 15.08.2020 నాటికి పూర్తవుతాయని , మర్రిపాలెం వైపు పనులు పురోగతిలో ఉన్నాయని 15.10.2020 నాటికి పూర్తవు తాయని తెలేయజేశారు.

ఎన్ఎస్‌టిఎల్ విమానాశ్రయం వైపు రహదారి పనులను పూర్తయిన విమానాశ్రయం నుండి ఎన్ఎస్‌టిఎల్ రహదారిపై ట్రాఫిక్ అనుమతించిన పిదప పనులను ప్రారంభించబడి 30.11.2020 నాటికి పూర్తవుతాయని తెలియజేశారు.

**దిగువ రోటరీ:** దిగువ రోటరీ కి సంబందించిన పనులు డిసెంబర్ -2020 చివరి నాటికి పూర్తి చేయడానికి ఏజెన్సీకి కాలపరిమితిని ఇచ్చినట్టు తెలియజేశారు. విధించిన కాలపరిమితులను ఖచ్చితంగా పాటించడం ద్వారా పై వొంతెన పనుల అన్ని రకములుగా డిసెంబర్ -2020 చివరి నాటికి పూర్తి చేసి విశాఖ నగరవాసులకు వినియోగంలోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులకు మరియు కాంట్రాక్టర్ ప్రతినిధులను చైర్ పర్సన్ , వీఎంఆర్‌డిఏ ఆదేశించారు.

అలాగే రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్ఓబి) వంతెనకి సంబంధించి రైల్వే అధికారులు నుంచి ఎటువంటి అనుమతులు రాలేదని, అనుమతులు వచ్చిన పిమ్మట 7 నెలల వ్యవధిలో పూర్తి చేయగలమని కాంట్రాక్టర్ ప్రతినిధులు తెలియజేశారు. ఈ సమీక్ష సమావేశం లో మెట్రో పాలిటన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు ఐఏఎస్, అదనపు కమిషనర్ మనజిర్ జీలని సామూన్ ఐఎఎస్, సూపరింటెండింగ్ ఇంజనీర్ కె.రామమోహన్ రావు, చీఫ్ అర్బన్ ప్లానర్ బి.సురేష్ కుమార్ , చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వై.హరి ప్రసాద్ మరియు కాంట్రాక్టర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీపీసీ సేవలు అభినందనీయం

## అంబులెన్స్ ప్రారంభంలో ఎమ్మెల్యే అధీప్



పరవాడ : ఎన్టీపీసీ సింహాద్రి సిఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా మొబైల్ హెల్త్ (అంబు లెన్స్) యూనిట్ సేవలను మంగళవారము ఎన్‌టిపిసి సమన్వే కాంప్లెక్స్‌లో ప్రారంభించారు. ఈ మొబైల్ హెల్త్ యూనిట్ ప్రారంభానికి ముఖ్యఅతిధిగా పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ , సింహాద్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. సుధర్షన్‌బాబు హజరై ఈఅంబులెన్స్ ను ప్రారంభించారు. అనంతరము ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లడుతూ ఎన్టీపిసి సేవలును కొనియాడారు.సుదర్శన్ బాబు మాట్లడుతూ ఈ మొబైల్ ఆరోగ్య సేవలు హెల్పేజ్ ఇండియా సహకారంతో నడుస్తున్నాయి అని ప్రాజెక్ట్ వ్యయం రూ .86 లక్షలు, ఇది వాహన ఖర్చుతో కలిపి ఉంటుంది అని అన్నారు. మొబైల్ ఆరోగ్య సేవలు ఎన్‌టిపిసి సింహాద్రి సమీపంలోని 27 గ్రామాలను కవర్ చేస్తాయి అనితెలిపారు. ఈ యూనిట్ ద్వారా విస్తరించిన సేవలు దగ్గు, జలుబు, జ్వరం, బిపి, డయాబెటిస్, థైరాయిడ్, ఎపిలెప్సీ, గ్యాస్ట్రోఎంటెరిటిస్, టిబి మరియు ఇతర కాలానుగుణ వ్యాధులు మరియు సుమారు 124 రకాల మందులు రోగ నిర్ధారణ తర్వాత ఉచితంగా పంపిణీ చేయబడతాయి అన్నారు.

డాక్టర్, ఫార్మసిస్ట్, సోషల్ వర్కర్-కమ్-డ్రైవర్, సోషల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ద్వారా ఈ సేవలు విస్తరించబడతాయి ఈసందర్భంగా అయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో సియస్ అర్ అదికారి అనంత్ ప్రకాష్, రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, పరవాడ జడ్పీటీసీ అభ్యర్థి పి. ఎస్ రాజు, మండల పార్టీ అధ్యక్షులు సిరిపురపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, పెందుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పైల అప్పలనాయుడు, బురద రాజు, బూస అప్పలరాజు, కూండ్రపు తాతజి, వెన్నెల సన్యాసిరవు,బొద్దపుచిన్నారావు, కోన రామారావు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరాడంబరంగా మాధవధార కుంచమాంబ అమ్మవారి పండుగ



మాధవధార : నిరాడంబరంగా మాధవధార కుంచమాంబ అమ్మవారి పండుగను శ్రీ మాధవ యువజన సమాజం అద్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి పూజారులు అమ్మవారి ఘటాలను ఊరేగించారు.

కరోనా వైరస్ ఉధృతం అవుతున్న నేపధ్యంలో భక్తులు అమ్మవారి పండుగను ఇంటి వద్దే నిర్వహించుకోవాలని శ్రీ మాధవ యువజన సమాజం ఛైర్మన్ సనపల బంగారురాజు, అధ్యక్షులు సనపల శ్రీకాంత్ తెలియజేసారు. ఈ సందర్భంగా భక్తులు సతకం పట్టు వద్దకు రాకుండా ఉదయం నుండి గట్టి చర్యలు చేపట్టారు. ప్రతి యేడాది కుంచమాంబ అమ్మవారి పండుగను ఘపంగా శ్రీ మాధవ యువజన సమాజం అద్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఉత్తరాంధ్ర నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకునేవారు. ఈ యేడాది కరోనా వైరస్ నేపధ్యంలో దర్శనాలను రద్దు చేశారు. ఈ కార్యక్రమంలో మాధవధార గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 'ఆళ్ల' ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



అనకాపల్లి : వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ పట్టణ అద్యక్షులు మందపాటి జానకిరామరాజు (జానీ) పుట్టిన రోజు పురస్క రించుకుని, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, పలు సేవా కార్య క్రమాలు నిర్వహించారు. అందలో భాగంగా స్ధానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసారు. అలాగే కరోనా కష్టకాలంలో నిరాదారంగా ఆలయం వద్ద ఉన్న, సాదువులకు దుప్పట్లు పంపిణీ, అలాగే నిరుపేదల మహిళలకు చీరలు పంపిణీ కార్య క్రమం నిర్వహించి, జానిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బుద్ద జగన్, బల్లా నిఖిల్, మణికంఠ, ఆళ్ల నాగేశ్వరరావు మిత్రమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నిరాడంబరంగా జానీ జన్మదిన వేడుకలు





అనకాపల్లి : స్ధానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం పట్టణ వైసీపీ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు పుట్టిన రోజు వేడుకలు నిరాడంబరంగా జరిగాయి. ఈసందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా వైసీపీ శ్రేణులు సమక్షంలో జానీ కేక్ కటింగ్ నిర్వహించి అందరికీ పంపిణీ చేసారు. అనంతరం నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేసారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, ఆళ్ల నాగేశ్వరరావు, కొణతాల మురళీకృష్ణ, గొర్లి సూరిబాబు, జాజుల రమేష్, తదితరులు మాట్లాడుతూ జానకిరామరాజు అజాత శత్రువని కొనియాడారు. ఆయన సేవలు పార్టీకి ఎంతో అవసరమన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం పార్టీ ప్రతిష్టను పెంచుతున్నారని అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తన కార్యాలయాన్నే పార్టీ కార్యాలయంగా మార్చి సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో పాలమరసెట్టీ మురళి, డాక్టర్ రామ్మూర్తి, జాజుల రమేష్, డాక్టర్ యశ్వంత్ , పలక రాము, బొడ్డేడ శివ, విల్లూరి శివ సూరి, పి.డి గాంధీ , కొణతాల భాస్కర్ , సకల గోవింద్, వెంపరాల శర్మ, పెతకంశెట్టి జగన్ మోహన్ రావు, యల్లపు చంద్ర మోహన్ , పలకా రవి, పాండురంగ సత్యారావు, వేగి త్రినాథ్, గైపురీ రాజు, సమ్మంగి కనకారావు, చవితిని కాంతం, కె . మ్ .నాయుడు, కుండల రామకృష్ణ, మైలపల్లి నాగేశ్వరరావు, అప్పికొండ వెంకట్రావు, కోన ఉమా, బోండా శంకర్రావు, కొణతాల ప్రసాద్, కోరుకొండ రాఘవ, డొంక సత్య, రాయవరపు జోగి రాజు, ఉగ్గిన అప్పారావు, మళ్ళ రామచంద్ర రావు, కాండ్రేగుల శ్రీరామ్, శోభ, అనురాధ, దాడి ఈశ్వరరావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

భీమునిపట్నం: ఆంధ్ర ప్రదేశ్ విద్యాలయాల సంస్థ వారిచే నడుపబడుతున్న 38 సాధారణ, 12 మైనారిటీ గురుకుల పాఠశాలలు, రీజనల్ సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్ గురుకుల పాఠశాలల్లో 2020 - 21 విద్యాసంవత్సరానికి గాను ఐదవ తరగతి ఇంగ్లీష్ మీడియం లో ప్రవేశానికి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని భీమునిపట్నం ఏ.పి.ఆర్.స్కూల్ ప్రిన్సిపాల్ ఉదయ కుమార్ తెలియజేశారు. విద్యార్థినులను జిల్లాల వారీగా, మన విశాఖ పట్నం జిల్లాలో బాలికల కొరకు ఏ.పీ.ఆర్ స్కూల్, భీమునిపట్నం మరియు ఏ.పి.ఆర్.స్కూల్ అచ్చుతాపురం, అదే విధంగా బాలుర కొరకు ఏ.పి.ఆర్. స్కూల్, నర్సీపట్నం లో ప్రవేశాలకై లాటరీ పద్ధతిన ఎంపిక చేయుటకు దర ఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఈనెల నాలుగవ తారీకు నుంచి 20 వ తారీఖు లోగా ఆన్లైన్లో మాత్రమే దరఖాస్తు చేసుకొనవలెనని అన్నారు. దరఖాస్తు రుసుము 50/- రూపాయలు. ప్రవేశానికి అర్హతలు మరియు దర ఖాస్తు చేయుటకు http:|aprjdc.apcfss.in లేదా http:/apreis.apcfss.in ను చూడగలరు. ఇతర వివరములకు కార్యాలయం పనిదినముల లో పని దినములలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:30 లోపు 9676404618, 7093323250 మరియు 9866559618 లలో సంప్రదించవచ్చని వివరించారు. కలెక్టర్ గారి సమక్షంలో లాటరీ పద్ధతి ద్వారా ఈ నెల 27 వ తారీఖున ఎంపిక చేసి, ఎంపికైన వారికి కౌన్సిలింగ్ ద్వారా పాఠశాలలు కేటాయించుట జరుగుతుంది.


**ఉత్తర రైల్వే**

**ఇ-ప్రొక్యూర్‌మెంటు పద్ధతి ద్వారా టెండర్ల ఆహ్వానం**

భారత రాష్ట్రపతి తరపున ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజరు, ఉత్తర రైల్వే, న్యూఢిల్లీ-110001 వారు క్రింద పేర్కొన్న ఐటమ్‌ల సరఫరాకై ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా ఇ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

| క్రమ సంఖ్య | టెండరు నెం. | సంక్షిప్త వివరణ | పరిమాణం | గడువు తేది |
|---|---|---|---|---|
| 01 | 09185014బి | BOXNHL వ్యాగన్ల కొరకు క్యాస్‌నబ్ 22HS బోగీ | 283 నెంలు | 03-08-20 |
| 02 | 09202473 | చెక్‌నట్ మరియు స్ప్లిట్ పిన్‌తో M-20 X 85 మిమీ పొడవు బోల్టు, నట్టు | 75405 నెంలు | 06-08-20 |
| 03 | 02202515డి | 24V, 290 AH డీజిల్ ఇంజిన్ లెడ్ యాసిడ్ స్టార్టర్ బ్యాటరీలు | 350 సెట్ | 21-08-20 |

గమనిక-1. వివరాలకై విక్రయదారులు IREPSN వెబ్‌సైటు అనగా www.ireps.gov.in ను చూడగలరు.
2. మాన్యువల్ ఆఫర్లు అంగీకరించబడవు.

టెండరు నోటీస్ నెం.07/2020-2021 తేదీ : 07.07.2020 1513/2020

**వినియోగదారులకు చిరునవ్వుతో సేవలు**

# విజయభాను సంపాదకీయం

## భూటాన్‌తోనూ కయ్యమా!

ఏ దేశంతోనైనా కయ్యానికి దిగడం చైనాకు కొత్త కాదు. కానీ దక్షిణాసియాలోని అతి చిన్న దేశమైనా భూటాన్‌తో కూడా సరిహద్దు వివాదాన్ని సృష్టించడం ఆ దేశ అల్పత్వాన్ని సూచిస్తున్నది. సరిహద్దు విషయంలో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజం. కానీ లేని వివాదాన్ని కావాలని లేవనెత్తడం చైనా దురుద్దేశాన్ని వెల్లడిస్తున్నది. 'భూటాన్‌తో సరిహద్దును గుర్తించడం ఇప్పటివరకు జరగలేదు. సరిహద్దులోని తూర్పు, మధ్య, పశ్చిమ ప్రాంతాలలో దీర్ఘకాలిక వివాదం సాగుతున్నది. ఈ వివాదంలో మూడో పక్షం (భారత్) తలదూర్చకూడదు' అని చైనా ఈ సందర్భంగా హెచ్చరించింది. భారత్, భూటాన్ సన్నిహిత దేశాలనేది తెలిసిందే. భూటాన్‌ను వేధించడం ద్వారా భారత్‌కు హెచ్చరిక పంపాలనేది చైనా ఎత్తుగడగా కనిపిస్తున్నది.

తమ తూర్పు ప్రాంతంలోని సాక్‌టెంగ్ అభయారణ్యం కోసం నిధులు కావాలంటూ ప్రపంచ పర్యావరణ సంస్థను భూటాన్ ఇటీవల కోరింది. అదే సమావేశంలో చైనా ప్రతినిధి ఇందుకు అభ్యంతరం తెలిపారు. ఈ అభయారణ్యం ఉన్న ప్రాంతం వివాదాస్పదమైనది కనుక నిధులు ఇవ్వకూడదని చైనా అడ్డుచెప్పింది. కానీ చైనా అభ్యంతరాలను తోసిపుచ్చి ఈ సంస్థ నిధులను విడుదల చేసింది. ఇప్పుడు మొత్తం తూర్పు ప్రాంతం వివాదాస్పదం అంటూ చైనా కొత్త పాట మొదలుపెట్టింది. సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకోవడానికి భూటాన్, చైనా మధ్య 1986 నుంచి 2016 వరకు పద్నాలుగు విడతల చర్చలు జరిగాయి. సరిహద్దు వివాదం కొలిక్కి వచ్చినట్టుగా కనిపించింది. భారత్ ఒత్తిడి వల్లే భూటాన్ తుది ఒప్పందంపై సంతకం పెట్టడం లేదని చైనా ప్రతినిధి ఒకరు ఆరోపించారు కూడా. ఈ సుదీర్ఘ చర్చలలో సాక్‌టెంగ్ అభయారణ్యం ఉన్న తూర్పు ప్రాంతం వివాదాస్పదమైందని చైనా ఎప్పుడూ అనలేదు. ఇప్పుడే నిద్రలేచినట్టుగా మాట్లాడుతున్నది.

శాంతికాముక దేశమైన భూటాన్ వివాదాల్లో తలదూర్చదు. భద్రతా మండలి సభ్యదేశాలతో పాటు అనేక రాజ్యాలతో నేరుగా రాయబార సంబంధాలు లేవు. చైనా తదితర దేశాలతో న్యూఢిల్లీలో ఉన్న తమ రాయబార కార్యాలయం ద్వారానే సంప్రదింపులు జరుపుతుంటుంది. చైనా దురాక్రమణ విధానాన్ని గమనించిన భూటాన్ తన భద్రత కోసం 1949లో భారత్‌తో స్నేహ ఒప్పందం చేసుకున్నది. అనతికాలంలోనే టిబెట్‌ను చైనా ఆక్రమించుకోవడంతో ఈ అనుమానాలు ధ్రువపడినట్టయింది. భారత్‌తో గాఢ మైత్రి ఉన్న ప్పటికీ టిబెట్ చైనాతో కూడా సత్సంబంధాలు నెలకొల్పుకుంటూ తటస్థతను పాటిస్తున్నది. అయినా 2017లో భూటాన్‌కు చెందిన డోక్లాం పీఠభూమిలోకి చైనా బలగాలు చొచ్చుకువచ్చాయి. భారత సైనికులు రంగంలోకి దిగి అక్కడ నిర్మాణాలు చేపట్టకుండా నిరోధించారు. ఇకముందు కూడా భూటాన్‌తో గిల్లికజ్జాలు పెట్టుకుంటే భారత్ చూస్తూ ఉండదని చైనా గ్రహించాలి.

## కనబడుటలేదు



పేరు: వనుం రామకృష్ణ గ్రామం.. ఆలమూరు వయస్సు...55 సంవత్సరాలు...ఎత్తు...5:4అడుగులు ముఖము... కోల ముఖము దుస్తులు: చొక్కా, లుంగీ పై పోటోలోని వ్యక్తి కనబడుట లేదు. ఆచూకీ తెలిపిన వారు ఈ సెల్ నెంబర్లకు పోన్ చేయవలసినదిగా కోరుచున్నాము సెల్ నెం: 9494956592, 9000603595

### వనదుర్గమ్మవారి ఆలయంలో
## ఘనంగా ప్రత్యంగిరా హెూమం

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా క్షేత్ర రక్షకురాలైన వనదుర్గమ్మవారి ఆలయంలో ఘనంగా ప్రత్యంగిరా హెూమం నిర్వహించారు.దుష్ట శక్తులను రక్షించేది,శత్రువుల భాధల నుండి రక్షణ కొరకు సకల కార్యముల యందు విజయం చేకూర్చడానికి నిర్వహించే ప్రత్యంగిరా దేవతా హెూమాన్ని లోక శ్రేయస్సు కొరకు, సర్వజనహితం కొరకు దేవస్థానం వారు ఘనంగా ప్రత్యంగిరా హెూమం నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వరుని పూజ చేసి ప్రత్యంగిరా దేవతా వేద మంత్రాలను పారాయణము చేస్తూ హెూమాన్ని చేసారు. అనంతరం వేద మంత్రోఛ్ఛారణలు,మంగళ వాయిద్యాలు నడుమ సుగంధ భరిత ద్రవ్యాలను షోడశోపచార పూజలు చేసి మహా పూర్ణహుతి సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని పురోహితులు చెళ్ళపిళ్ళ.ప్రసాద్ శర్మ, దేవులపల్లి ప్రసాద్, కూచిభట్ల ప్రసాద్ పాల్గొన్నారు.

# విదేశీ విద్యార్థులకు అమెరికా భారీ షాక్!
## ట్రంప్ సర్కార్ మరో అనూహ్య నిర్ణయం

వాషింగ్టన్: ఇప్పటికే హెచ్-1బీ వంటి పలు వీసాలు, గ్రీన్‌కార్డుల జారీపై నిషేధం విధించిన అమెరికా ప్రభుత్వం మరో అనూహ్య నిర్ణయం తీసుకుంది. విదేశీ విద్యార్థులకు భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. కరోనా వ్యాప్తి నేపథ్యంలో పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించేందుకు విద్యాసంస్థలు సిద్ధమైనట్లయితే విదేశీ విద్యార్థులు దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని ప్రకటించింది. అలాగే కొత్తగా విద్యార్థి వీసాలు జారీ చేయబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) సోమవారం ప్రకటన విడుదల చేసింది. "వచ్చే విద్యా సంవత్సరానికి గానూ పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించేందుకు నిర్ణయించిన స్కూళ్లలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వీసా జారీచేయబోం. అలాంటి వారిని దేశంలోకి అనుమతించబోం. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా ఎఫ్-1, ఎం-1పై ప్రస్తుతం అమెరికాలో ఉంటూ ఆన్‌లైన్ తరగతులకు హాజరవుతున్నవారు దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుంది. చట్టబద్ధంగా ఉండాలనుకుంటే భౌతికంగా తరగతులకు హాజరయ్యేందుకు అనుమతిస్తున్న విద్యా సంస్థలకు బదిలీ చేసుకోవాలి" అని ఐసీఈ తన ప్రకటనలో పేర్కొంది. లేదంటే ఇమ్మిగ్రేషన్ శాఖ తీసుకోబోయే చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది. రెండు మాధ్యమాల ద్వారా తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు.. ఎక్కువ మంది విద్యార్థులు భౌతికంగా హాజరవుతున్నారని నిరూపించకోవాల్సి ఉంటుందని తెలిపింది.

ట్రంప్ ప్రభుత్వ తాజా నిర్ణయం భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్(ఐఐఈ) గణాంకాల ప్రకారం 2018-19 విద్యా సంవత్సరంలో అమెరికాలో దాదాపు 10 లక్షల మందిపైగా విదేశీ విద్యార్థులు ఉన్నారు. వీరి ద్వారా 2018 ఆర్థిక సంవత్సరంలో అమెరికా ఆర్థిక వ్యవస్థకు 44.7 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరింది. ఇతర దేశాల నుంచి అమెరికా వెళ్లేవారిలో అత్యధికులు చైనా, భారత్, దక్షిణ కొరియా, సౌదీ అరేబియా, కెనడాకు చెందినవారే. ట్రంప్ తాజా నిర్ణయంతో అక్కడి విద్యాసంస్థలన్నీ దిక్కుతోచని స్థితిలో పడ్డాయి.

ట్రంప్ తాజా నిర్ణయంపై ప్రతిపక్ష డెమొక్రాటిక్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతోంది. విద్యాసంస్థలు కచ్చితంగా తెరవాలని ఆదేశిస్తున్న ట్రంప్ మూర?పు నిర్ణయం వల్ల లక్షలాది మంది విద్యార్థుల ప్రాణాలు ప్రమాదంలోకి జారే అవకాశం ఉందని వాపోయారు. "వైట్ హౌస్‌లో ఉన్న ప్రస్తుత పాలనా యంత్రాంగ క్రూరత్వానికి హద్దులే లేకుండా పోతున్నాయి" అని ఇటీవల అధ్యక్ష బరి నుంచి తప్పుకున్న సెనెటర్ బెర్నీ శాండర్స్ అన్నారు.

# ప్రపంచంలో భారత్‌లోనే ప్రతి పది లక్షల్లో అతి తక్కువ కోవిడ్ కేసులు

న్యూ ఢిల్లీ : ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం భారత్ లో ప్రతి పది లక్షల కు 505.37 మంది కేసులు కాగా అంతర్జాతీయంగా 1453.25 కేసులున్నాయి. చిలీలో పదిలక్షలకు 15,459.8 కేసులు, పెరూ, అమెరికా, బ్రెజిల్, స్పెయిన్ లలో 9070.8, 8560.5, 7419.1 5358.7 కేసులు నమోదయ్యాయి. తక్కువ సంఖ్యలో కేసులు నమోదైన దేశాలలో భారత్ ఒకటని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక పేర్కొంది. మరణాల సంఖ్య కూడా భారత్ లో తక్కువగా ఉన్నట్టు పేర్కొంటూ, బ్రిటన్ లో ప్రతి పదిలక్షలకు 651.4 కేసులు, స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్, అమెరికాలో 607.1, 576.6, 456.7 %ఖఅ% 391.0 నమోదయ్యాయి. భారత్ లో ఆస్పత్రుల మౌలిక సదుపాయాలు తగినంతగా పెంచి సమర్థంగా చికిత్స చేయటం, ఆక్సిజం అందుబాటులో ఉంచటం, ఐసియు, వెంటిలేటర్ సౌకర్యం అందులో భాగం. జులై 7నాటికి

దేశంలో ప్రత్యేక కోవిడ్ ఆస్పత్రులు1201 ఉండగా ఆరోగ్య కేంద్రాలు 2611, కోవిడ్ రక్షణ కేంద్రాలు 9909 ఉన్నాయి. ఒక మోస్తరు లక్షణాలున్న వారికి సైతం చికిత్స చేస్తారు. అలాంటి సిద్ధత ఉండటం వల్లనే కోలుకున్నవారి శాతం ఎక్కువగా, మరణాల శాతం తక్కువగా ఉంటోంది.

త్వరగా గుర్తించటం, సమర్థంగా చికిత్స కారణంంగా కోలుకుంటున్నవారు బాగా ఎక్కువగా ఉన్నారు. గడిచిన 24 గంటల్లో మొత్తం 15516 మంది కోలుకున్నారు. దీంతో ఇప్పటివరకు మొత్తం కోలుకున్నవారి సంఖ్య 4,39,947కు చేరింది. రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి తీసుకుంటున్న ఉమ్మడి చర్యల ఫలితంగా బాధితులకు, కోలుకుంటున్నవారికి మధ్య తేడా బాగా పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం కొలుకున్నవారిసంఖ్య చికిత్సలో ఉన్నవారికంటే 1,80,390 ఎక్కువగా ఉంది. దీనివల్ల కోలుకున్న వారి శాతం నేటికి 61.13% అయింది. ప్రస్తుతం 2,59,557 మంది బాధితులు ఉండగా వారందరికీ డాక్టర్ల పరివేక్షణలోచికిత్స జరుగుతొంది. పరీక్షలు, గుర్తింపు, చికిత్స అనే త్రిముఖ వ్యూహంలో భాగంగా అన్ని రాష్ట్రాలు తగిన విధంగా వ్యవహరిస్తున్నాయి. దీనివల్ల రోజుకు రెండు లక్షలకు పైగా పరీక్షలు జరుగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో 2,41,430 శాంపిల్స్ పరీక్షించారు. దీంతో ఇప్పటివరకు జరిపిన పరీక్షల సంఖ్య 1,02,11,092 కు చేరింది. పరీక్షల లాబ్ ల సంఖ్య కూడా బాగా పెరిగింది. ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వరంలో 793 లాబ్ లు ఉండగా ప్రయివేట్ లో 322 ఉన్నాయి. మొత్తం లాబ్ ల సంఖ్య 1115 అయింది. తక్షణం ఫలితాలు చూపే పరీక్షల లాబ్స్ : 598 (ప్రభుత్వ: 372 ం ప్రైవేట్: 226) ట్రూ నాట్ ఆధారిత పరీక్షల లాబ్స్ : 423(ప్రభుత్వ: 388 ం ప్రైవేట్: 35) సిబినాట్ ఆధారిత పరీక్షల లాబ్స్: 94 (ప్రభుత్వ: 33 ం ప్రైవేట్: 61)

# 13 లీటర్ల నాటుసారా తో వ్యక్తి అరెస్ట్
## - 14 రోజులు రిమాండ్ విధించిన కోర్టు




దేవరాపల్లి : స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై పి . నరసింహమూర్తి ఆధ్వర్యంలో నాటుసారా అక్రమ రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వెంకట రాజపురం గ్రామ శివారులో ఉన్న సత్యనారాయణ మూర్తి కొండ పక్కన గల రోడ్డు మీద అక్రమంగా నాటుసారా రవాణా జరుగుతుందని సమాచారం రావడంతో ఎస్సై తమ సిబ్బంది రాము, వెంకటరావు సహకారంతో వెళ్లి దాడి చేశారు.

పోలీసులను చూసి వెంకటరాజపురం గ్రామానికి చెందిన శెట్టి నాగరాజు పారిపోవడానికి ప్రయత్నించగా ఎస్సై, తమ సిబ్బంది నాగరాజుని పట్టుకోగా, అతను వద్ద నుంచి 13 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడం జరిగింది. అకురెన్స రిపోర్ట్ ద్వారా ముద్దాయిని 13 లీటర్ల నాటుసారాను స్వాధీన పరచుకుని నాగరాజు అరెస్ట్ చేసి చోడవరం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ ఐ తెలిపారు.

# కవి సమయం

## శ్రీకృష్ణ దేవుడు

అదిగదిగో దేవుడు
శ్రీ కృష్ణ దేవుడు
సర్వ మంతా వున్నాడు.
పరమాత్ముని తలచుటయే పుణ్యమైన దినమని
ప్రతి దినము పరమావధి మీరని
గోవర్ధన గిరినెత్తి-భయమన్నది పోగొట్టి
వెతలు మోత మోసిరి- ప్రజలు చెంత నిలిచిరి
క్షణమంత పిలుపుతో - సాయమెంతో వుందని
శ్రమజీవన సాధనలో - సర్వజీవ రాసివి;
కొరత లేని జీవనం - ప్రతి ప్రాణికి ప్రాప్తివి.
పాడగా పాటయందు
ఆడగా ఆటయందు
పనిపాటులు యందును
చిత్తం, శరణం అనుకొని
లేనిదంటు తీరెను
ఉన్నదెంతో యిచ్చెను
విశ్వమంత దివ్యము - దివ్యమైన తేజము.

కవిత రచన :
మజ్జి శ్యామసుందరరావు

# పంచాంగం

మాసం : ఆషాడం ; తిథి : తదియ ఉ.9.12; ధనిష్ట రా.1.56; ఉ.శే.వ.6.34వ

బుధవారం 08-08-2020

**మేషం** : ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం. **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు.ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **మిథునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదాపడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘ కాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కాం´మవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. **కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవ దర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజ యాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బం దులు తలెత్తుతాయి. **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిల దొక్కు కుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారి తీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం ఆర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. **ధనుస్సు** : వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. **మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్యలెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. **కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. **మీనం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అను కూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆలయాలను సందర్శిస్తారు.



# లక్ష్మీదేవి స్వరూపమైన గోదాదేవి వృత్తాంతం!!

## సంకీర్తన

లక్ష్మీ స్వరూపమైన గోదాదేవి శ్రీరంగంలో క్రీ.శ 776లో జన్మించినట్లు పురాణాలు చెపుతున్నాయి. ద్రవిడ భాషల్లో గోదాదేవికి కోద్దై, చూడిక్కొడుత్త నాచ్చియార్, ఆండాళ్, అనే నామాంతరములు గలవు. తెలుగు సాహిత్యంలో సాహితీ సమరాంగణ సార్వభౌముడిగా ప్రఖ్యాతి వహించిన విజయనగర చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయలు రచించిన తెలుగు ప్రబంధం ఆముక్తమాల్యద గోదాదేవీ వైశిష్ట్యమునకు ప్రతీక. ఈ ప్రబంధానికి విష్ణుచిత్తీయం అనే మరోపేరున్న సంగతి తెలిసిందే.

ఇక గోదాదేవి జన్మ వృత్తాంత్తాన్ని ఓ సారి పరిశీలిస్తే.. శ్రీరంగంలో ఆషాఢ శుద్ధ చతుర్దశిన, పుబ్బ నక్షత్రంలో గోదాదేవి జన్మించింది. గోదాదేవి, శ్రీ విష్ణుచిత్తులకు పూలతోటలో లభించిన కుమార్తె. ఈమెను విష్ణుచిత్తుల దంపతులు చాలా అల్లారుముద్దుగా పెంచుకున్నారు. యుక్త వయస్సులో వచ్చిన తర్వాత లక్ష్మీస్వరూపమైన గోదాదేవి, తన శ్రీవారు అయిన రంగనాథుడినే తన పతిగా పొందాలనుకుంటుంది.

వైష్ణవుడైన విష్ణుచిత్తుడు రంగనాథ స్వామిని ప్రతినిత్యం భక్తిశ్రద్ధలతో కొలిచేవాడు. ఇందులో భాగంగా... ప్రతిరోజూ స్వామివారికి పూలమాలలను సుందరంగా అల్లుకుని అలంకరణకు తీసుకుని వెళ్లేవాడు. అయితే వాటిని గోదాదేవి ముందే ధరించి తర్వాత స్వామివారికి పంపిస్తుంది.

ఈ రహస్యం తెలుసుకున్న విష్ణుచిత్తుడు దుఃఖించి రంగనాథుడికి మాలాధారణ గావించరు. దీంతో స్వామివారి మొహం చిన్నబోతుంది, దీనికంతటికీ తన కుమార్తె తప్పిదమే కారణమని విష్ణుచిత్తుడు బాధపడుతుంటే.. రంగనాథుడు విష్ణుచిత్తునితో ఇక ప్రతిరోజూ తనకు గోదాదేవి ధరించిన మాలాధారనే కావాలని ఆదేశిస్తారు. రంగన్న ఆదేశం మేరకే విష్ణుచిత్తుడు నడుచుకుంటాడు. ంతలో శ్రీరంగనాథుడే తనకు భర్తగా రావాలని కోరుకుంటూ గోదాదేవి... తన తోటి బాలికలతో కలిసి తిరుప్పావై (తిరుప్పావు) వ్రతాచరణ చేస్తారు. ఈ వ్రతమహిమతో... లక్ష్మీ స్వరూపమైన గోదాదేవి శ్రీరంగనాథుడి సతీమణి అవుతుంది. రంగనాథుడి ఆజ్ఞమేరకే గోదాదేవికి, రంగనాథస్వామికి విష్ణుచిత్తుడు దేవేరులకు భూలోకంలో వైభవంగా వివాహం జరిపించాడని పురాణాలు పేర్కొంటున్నాయి. వివాహానంతరం గోదాదేవి ఆ చిద్విలాసునిలో లీనమవుతుంది. అదిచూసి విష్ణుచిత్తుడు దుఃఖితుడైతే మలయప్ప స్వామి జ్ఞానోపదేశం చేస్తాడు. దీంతో విష్ణుచిత్తుడు గోదాదేవి లక్ష్మీస్వరూపి అని, తన కుమార్తె అన్న మాయ నుంచి బయటపడతాడు. ఇకపోతే... గోదాదేవి వ్రతాచరణ సమయంలో రచించిన తిరుప్పావై చాలా ప్రసిద్ధి చెందింది. దీనిని ధనుర్మాసంలో ప్రతిరోజూ రోజుకొక్కటి చొప్పున ఓ పాశురం వైష్ణవ ఆలయాల్లో పఠించడం చేస్తారు. అందుచేత యువతులు ధనుర్మాసంలో 30 రోజుల పాటు గోదాదేవి వ్రతాచరణ చేస్తే తను మెచ్చిన, సుగుణుడైన భర్త లభిస్తాడని పురాణాలు చెబుతున్నాయి.

# మంత్రి కురసాల కన్నబాబును మర్యాదపూర్వకంగా కలిసిన వైస్‌ఛాన్సలర్ డాక్టర్ జానకిరామ్



కాకినాడ : పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వద్దనున్న డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ జానకి రామ్ మంగళవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ శాఖ మంత్రి కురసాల కన్నబాబు ఆయన క్యాంపు కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు విశ్వవిద్యాలయం అభివృద్ధికి తోడ్పాటును అందించాలని మంత్రికి తెలపగా మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ జగన్ మోహన్ రెడ్డి ఉద్యాన పంటలు, ఉద్యానశాఖ పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. కనుక ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పరిశోధనలు ప్రాధాన్యత క్రమంలో విస్తృతపరచలని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాలు ఉద్యాన పంటలకు ఎంతో అనుకూలంగా ఉన్నాయన్నారు. నూతన వంగడాలను రూపొందించడంతో పాటు మార్కెటింగ్ అవకాశాలను పెంపొందించడంలో నూతన పద్ధతులను అన్వేషణ చేయాలని మంత్రి సూచించారు. అదేవిధంగా ఉద్యాన పంటలను, ఉద్యానశాఖ ను మరింత అభివృద్ధి చేసే విధంగా ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వృత్తి విద్య కోర్సులను ప్రారంభించాలని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఉద్యాన పంటలు పండించే రైతులకు అవగాహన కల్పించే విధంగా అనేక నూతన కార్యక్రమాలకు రూపకల్పన చెయ్యాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టిన్నట్లు మంత్రి తెలిపారు. వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం లో పనిచేసే ప్రొఫెసర్లు శాస్త్రవేత్తలు విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో పేరు తెచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుండి అన్ని సహాయ సహకారాలు అందించే విధంగా కృషి చేయడం జరుగుతుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయం రిజిస్టర్ డా కె.గోపాల్, శాస్త్రవేత్త డా కె భగవాన్, డా బి వి కే భగవాన్, ఏ డి ఏ మార్టేరు జోగి నాయుడు, కాకినాడ ఏడిఏ పద్మశ్రీ, పి.ఆర్.ఓ రత్న కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# నర్సీపట్నం నుంచి కొయ్యూరు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి



డిఎంతో మాట్లాడుతున్న శివప్రసాద్

కొయ్యూరు : నర్సీపట్నం నుంచి కొయ్యూరుకు ఆర్టీసి బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని అరకు ఎంపి మాధవి భర్త శివప్రసాద్ మంగళ వారం నర్సీపట్నం ఆర్టీసి డిపో మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు. కరోనా వైరస్ దృష్టిలో పెట్టుకొని మార్చి 23వ తేదీ నుంచి అన్ని చోట్ల ప్రజారవాణాలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. నాటి నుంచి నేటి వరకూ కొయ్యూరు మండలానికి వచ్చే ఆర్టీసీ సర్వీసులు నిలిపివేయడం జరిగిందని శివ ప్రసాద్ తెలిపారు. రవాణా సౌకర్యాలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను డిఎం దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కొత్త మార్గదర్శకాలతో ఇప్పుడైనా తిరిగి నర్సీపట్నం నుంచి కొయ్యూరు, కొయ్యూరు నుంచి నర్సీపట్నం వరకు కనీసం రోజు రెండు బస్సులు అయినా తిరిగే విధంగా చూడాలని డిఎంను కోరారు. దీనిపై డిఎం రెండు రోజుల్లో బస్సులు తిరిగే విధంగా ఏర్పాటు చేస్తానని అని హామీ ఇచ్చారు.

# 1200 కేజీల గంజాయి పట్టివేత



గొలుగొండ : విశాఖ ఏజెన్సీ ప్రాంతం ధారకొండ నుంచి ఇతర రాష్ట్రాలకు లారీలో తరలిస్తున్న 1,200 కిలోల గంజాయిని మంగళవారం కేడిపేట పోలీసులు పట్టుకున్నారు.

కడిపేట ఎస్సై భీమరాజు తెలిపిన వివరాల ప్రకారం స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 60 లక్షలు ఉంటుందని, గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి లారీ స్వాధీనం తీసుకున్నామన్నారు.

పోలీసులు అందిన ముందస్తు సమాచారం దారి కాసి పట్టుకుంటామని తెలిపారు.

## జిల్లా ఆ సుపత్రిలో మొట్ట మొదటి సిజేరియన్ ఆపరేషన్

# తల్లి బిడ్డ క్షేమం



పాడేరు : పాడేరు మండల కేంద్రంలో ఉన్న జిల్లా ఆసుపత్రిలో మొట్టమొదటి సిజేరియన్ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. హుకుంపేట మండల సంతారి

గ్రామానికి చెందిన గర్భిణీ స్త్రీ లోచలి వసంత (23) రెండవ ప్రసవం కోసం సోమవారం (6.7.20)న స్థానిక జిల్లా ఆసుపత్రిలో చేరారు. వైదులు పరీక్షించి సిజేరియన్ ఆపరేషన్ పడుతోందని గుర్తించి మంగళవారం జిల్లా ఆసుపత్రిలోని వైద్యులు డా. ఒ. శ్రీలత, డా. తమర్భ నరసింగరావు, డా. సరిత బృందం సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించి తల్లి బిడ్డలను క్షేమంగా రక్షించ గలిగారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. గతంలో సిజేరియన్ ఆపరేషన్లకు పాడేరు నుంచి గర్భిణీ స్త్రీలను విశాఖపట్నం తరలించేవారు. ఇటీవల కాలంలో ఐటిడి ఏ ప్రాజెక్టు అధికారి డా. వేంకటేశ్వర్ స్వయంగా వైద్యులు కావడంతో వైద్య సేవలు సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గత వారం జిల్లా ఆసుపత్రిని సందర్శించి ఆపరేషను అవసరమైన అన్ని ఏర్పాట్లు, థియేటర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపధ్యంలో ప్రత్యేకంగా అధిక వేతనం ఐటిడి ఏ నుంచి ఇచ్చి నలుగురు వైద్య నిపుణులను నియమించారు. డా.శారదా, డా.ప్రవీణ్ వర్మ, ప్రభావతి, డా. భాను సాయి కుమార్లను నియమించి మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు.

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి శ్రీమతి పుష్ప శ్రీవాణి, అరకు ఎం.పి. జి.మాధవి,పాడేరు ఎం. ఎల్. ఎ.కె. భాగ్యలక్ష్మి, అరకు ఎం. ఎల్. ఎ చెట్టి పాల్గుణ, ఐటిడి ఏ పి.ఓ. డా. వేంకటేశ్వర్,

మెడికల్ కౌన్సిల్ సభ్యులు డా. నర్సింగరావు జిల్లా ఆసుపత్రిని సందర్శించి తల్లి బిడ్డను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాతా శిశువులకు మన్యంలో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డా. కృష్ణారావు, డా. ప్రవీణ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## "పేదల ఇళ్లలోనూ వైకాపా నేతల కక్కుర్తి"

### తెదేపా అధినేత నారా చంద్రబాబు



అమరావతి: వైకాపా ప్రవేశపెట్టిన పథకాలన్నీ ప్రజల కోసం కాదు అని తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. కుప్పంలో హౌసింగ్ బాధితులకు అండగా ఉంటామని అన్నారు. ఇళ్ల స్థలాల సేకరణలో అవినీతిపై తెదేపా శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో తెలుగుదేశం నేతలతో చంద్రబాబు ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో వైకాపా నేతలు దోచుకుంటున్నారు... తెదేపా హయాంలో కట్టించిన ఇళ్లను లబ్ధిదారులకు ఎందుకివ్వలేదు అని చంద్రబాబు ప్రశ్నించారు.

"పేదల ఇళ్లలోనూ వైకాపా నేతలు కక్కుర్తి పడుతున్నారు. ప్రజాధనాన్ని ఎక్కడికక్కడ దుర్వినియోగం చేస్తున్నారు. తెదేపా హయాంలో 10 లక్షల ఇళ్లు కట్టాం. మేం కట్టిన ఇళ్లను కరోనా సెంటర్లుగా మార్చారు. సిద్ధంగా ఉన్న గృహాలను శిథిల స్థితికి చేరుస్తున్నారు. కరోనాపై జాగ్రత్తలు తీసుకోకుండా రాజకీయ కక్షలు తీర్చుకుంటున్నారు. తప్పుడు కేసులు పెట్టి తెదేపా నేతలను వేధిస్తున్నారు" అని ఏపీ ప్రభుత్వంపై చంద్రబాబు మండిపడ్డారు.

# ఉపాధి కూలీలకు పే స్లిప్ లు పంపిణి



అచ్యుతాపురం : మండలంలో చోడపల్లి పంచాయితిలో మంగళవారం ఉపాధిహామీ కూలీలకు వైసిపి నాయకులు , మాజీ ఎంపీపీ వడిశల శ్రీనువాసరావు పే స్లిప్ లు పంపిణి చేశారు . ఈ కార్యక్రమంలో వైసిపి మండల యూత్

అధ్యక్షులు గండిబోయిన వెంకట్ , ఎంపిటీసీ అభ్యర్థి లాలం శ్రీను, కార్యదర్శి సత్యనారాయణ, పంచదార్ల అప్పడు తదితరులు ఉన్నారు .

# వైఎస్సార్ స్ఫూర్తితో అందరికీ సంక్షేమ ఫలాలు



తాడేపల్లి: మరణంలేని మహానేత వైఎస్సార్ అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రేపు(బుధవారం) వైఎస్సార్ జన్మదినం సందర్భంగా విగ్రహాలకు దండలు వేసి నివాళర్పించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ జయంతిని రైతు దినోత్సవం గా జరుపుకోవాలని తెలిపారు. "దివంగత మహానేత వైఎస్సార్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పేదలకు 32 లక్షల ఎకరాలు పంచారు. ఆరోగ్యశ్రీతో పేదలను ఆదుకున్నారు. పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా గుండె ఆపరేషన్లు" చేయించారని అంబటి రాంబాబు గుర్తుచేశారు. వైఎస్సార్ స్ఫూర్తితో ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకం కూడా గుర్తుకు రాకపోవడం గమనించాలన్నారు. చెట్టు పేరు చెప్పుకుంటు కాయలు అమ్ముకునే వాళ్ళను పార్టీ సహించదని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

# బాధ్యులను ఉపేక్షించేది లేదు

### టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



విజయవాడ: సప్తగిరి మాసపత్రికపై రాజకీయ కుట్రకోణం దాగుందని టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ గతంలోనూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని, దేవుడిని కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. "గతంలో ఆర్టీసీ బస్సుల్లో అన్యమత ప్రచారం, తిరుమల కొండల్లో సిలువ పెట్టారని సోషల్ మీడియాలో టీడీపీ తప్పుడు ప్రచారం చేసింది. దేవుడిని కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని ఎవరు చూస్తున్నారో.. వారి ఇంగిత జ్ఞానానికి వదిలి వేస్తున్నాం. మధ్యలో ఎవరైనా కవర్లు మార్చారా? అనేది విచారణలో తేలాల్సి ఉంది. టీటీడీ కార్యాలయంలో అన్యమత పుస్తకాలు ఎందుకు ఉంటాయి? దేవుడిపైనే నింద వేయాలని చూస్తున్నారని" ఆయన ధ్వజమెత్తారు. గతంలో ఇలాంటి ప్రయత్నాలు చేసిన వారిపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ ఘటనలో ఎవరైనా సరే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. దీనిపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా కరోనా విజృంభణ సమయంలో ప్రజలను కాపాడమని సుందరకాండ, వేద పారాయణం టీటీడీ తరపున చేశామని, భక్తులకు దర్శనం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత కష్ట కాలంలో రాజకీయ దురుద్దేశ్యం తో చేస్తున్న ఆరోపణలు సరికావని వైవీ సుబ్బారెడ్డి ఖండించారు.


# చందకవీధిలో ఎమ్మెల్యే చేతుల మీదుగా వీధి కొళాయి ప్రారంభం



చందకవీధి లో కొళాయి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం : చోడవరం పట్టణంలో చందక వీధి లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఇటీవల నిర్మాణం చేపట్టినా వీధి కుళాయిని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. కొలాయి ఏర్పాటు ద్వారా తాగునీటి సమస్య పరిష్కరించడం పై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు పల్లా నర్సింగ్ రావు, టౌన్ అధ్యక్షులు పుల్లేటి వెంకట్రావు, శ్రీకాంత్, ఓరుగంటి నెహ్రు, జ్యోతుల రమేష్, స్థానిక వైసీపీ నాయకులు, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి మార్కెట్ యార్డు ఛైర్మన్ హల్యారాణి దంపతులకు ఘన సన్మానం



కొయ్యూరు : పాడేరు, చింతపల్లి మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన హల్యా రాణి, జల్లి సుధాకర్ దంపతులను మంగళ వారం కొయ్యూరు మండల వైయస్సార్ పార్టీ మండల అధ్యక్షులు సుమర్ల సూరిబాబు ఆధ్వర్యంలో చింతపల్లిలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పిన వెంకట రమణ, జల్లి బాబులు, బిడిజం అప్పారావు, గాడి అచ్చిరాజు, దూపం శ్రీను, ఉల్లి రామ్మూర్తి, దోని బాబ్జి పాల్గొన్నారు.

# ఎంఆర్‌పిఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవం



దేవరాపల్లి : మాన్యశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదిన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంఆర్ పిఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవం ఆ సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కలిగొట్ల గ్రామంలో మంగళ వారం ఈ సందర్భంగా జండా ఆవిష్కరణ చేసి, కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు, విశాఖ జిల్లా రూరల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కంటిపాము వెంకటరమణ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ సారథ్యంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 1994 జూలై 7 న ఆవిర్భావ జరిగిందన్నారు.

నాటి నుంచి నేటి వరకు అనేక ఉద్యమాలు ద్వారా సమస్యల పరిష్కారం కొసం కృషి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ పిఎస్ కార్యకర్తలు బల్లంకి ఈశ్వరరావు, సత్తిబాబు, పాలిబాబు, కట్టమూరి గురువులు తదితరులు పాల్గొన్నారు.

# నరసాపురంలో భార్యాభర్తలకు కరోనా పాజిటివ్



నరసాపురంలో కరోనా పాజిటివ్ కేసులు రావడంతో విధులు నిర్వహిస్తున్న పోలీసులు

చోడవరం : మండలంలోని నర్సాపురం గ్రామంలో భార్యాభర్తలకు కరోనా పాజిటివ్ రావడంతో గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. గ్రామానికి చెందిన వారు హైదరాబాదు లో ఉంటూ ఉపాధి పొందేవారు. అయితే హైదరాబాదులో కరుణ ఉదృతి తీవ్రమవుతున్నడంతో గత శనివారం స్వగ్రామానికి వచ్చారు. వారికి కరోనా టెస్టులు చేయడంతో మంగళ వారం ఇద్దరు కు కరోనా పాజిటివ్ రావడంతో పోలీసులు, వైద్యాధికారులు గ్రామాన్ని సందర్శించి వారిని ఐసోలేషన్ కి తరలించారు. అలాగే గ్రామంలో కరోనా కేసులు రావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ మా స్కూలు ధరించాలని, తప్పనిసరి అయితే తప్ప ఎవరు బయటకు రావద్దని సూచించారు.

# సారా మద్యం అమ్మకాలు జరిపితే ఇకపై జైలుకే

## - ఎస్ఐ నరసింహమూర్తి



దేవరాపల్లి : మండలంలో నాటుసారా, అక్రమ మద్యం విక్రయాలపై ఇక కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్ ఐ పి. నరసింహమూర్తి హెచ్చరించారు. స్థానిక విలేకర్లతో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇటీవల జరిగిన శాసనసభ సమావేశంలో నాటుసారా, మద్యంకు సంబంధించి అబ్కారీ వ్యవస్థ గురించి ప్రొహిబిషన్ యాక్ట్ 1995 చట్టమును సవరించి సమూల మార్పులు చేయడం జరిగిందన్నారు. ఇక నుంచి ఎవరైనా నాటుసారా తయారు చేసిన, పులుపులు వేసిన ,నాటుసారా వంట చేసి అమ్మిన, నల్లబెల్లం కలిగి ఉన్న అదే విధముగా నాటుసారాను, నల్ల బెల్లమును ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి ఎగుమతి దిగుమతి చేసినట్లయితే, కొత్తగా వచ్చిన ప్రొహిబిషన్ చట్టం 1995 ప్రకారం ఎనిమిది సంవత్సరాలు జైలు శిక్ష ఉంటుందన్నారు. ఈ చట్టం 20 మే .2020 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు.

గిరిజన మంత్రి దృష్టికి

# కొయ్యూరు మండల సమస్యలు



కొయ్యూరు : కొయ్యూరు మండల సమస్యలను గిరిజన మంత్రి పుష్పశ్రీవాణి దృష్టికి తీసుకువెళ్లినట్లు వైసిపి నాయకులు బడుగు రమేష్, వారా నూకరాజు తెలిపారు. కొయ్యూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల మంజూరు, రాజేంద్ర పాలెం నుండి సుమారు 500 ఎకరాల సాగు భూమికి వెళ్లటానికి వంతెన మంజూరు చేయాలని, స్థానిక రామా లయం వెనుక ఉన్న కాలువ నుండి, అలాగే మంప పంచాయతీ ఆకులపాడులో ఉన్న చెక్‌డ్యాంను పూర్తి సామర్థ్యంతో నిర్మాణం చేయాలని, లేదంటే గ్రామం ముంపుకు గురి అవుతుందన్న విషయాన్ని తెలియజేశారు.

ఈ కార్య క్రమంలో నాయకులు కొప్పు రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు వైద్యుల బృందం యానాం రాక




యానాం : నియోజకవర్గంలో కరోనా వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైరస్ బారినపడిన రోగులకు చికిత్స అందించేందుకు ముగ్గురు వైద్యుల బృందం మంగళవారం యానాం చేరుకున్నారు.

పుదుచ్చేరి ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు మేరకు వారు యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందజేయనున్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు దోషులకు

# చట్టప్రకారం ఉరిశిక్ష అమలు జరిగేలా చర్యలు చేపట్టాలి

చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారామ్



విశాఖపట్నం : విశాఖ జిల్లా లోని యలమంచిలి, కొత్తలి. గ్రామంలో, అమాయ కత్వం, ఒంటరితనాన్ని, తల్లిదండ్రులను కోల్పోయిన వైనాన్ని పసిగట్టి 15 ఏళ్ల మైనర్ బాలికపై గత ఏడాదిగా, ఆమెను బెదిరింపులకు పాల్పడుతూ గర్భవతిని చేసిన ముగ్గురు దోషులను వెంటనే పోలీసులు అదుపులోనికి తీసుకొని త్వరితగతిన చట్ట ప్రకారం ఉరిశిక్షలు అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారామ్ డిమాండ్ చేశారు. మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఈ సంఘటన బాలికల ఉనికినే ప్రశ్నార్థకంగా చేసేదిలా ఉందని అన్నారు. సభ్యసమాజం నుండి ఇటువంటి వ్యక్తులను బహిష్కరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రతిష్టాత్మక దిశ చట్టం లోని వివిధ సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేసి వీరికి ఉరిశిక్షలు త్వరితగతిన ఖరారు చేసేలా పోలీసు అధికార్లు చర్యలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి, రాష్ట్ర పోలీసు డిజిపిల దృష్టికి లేఖలు రూపంలో తీసుకెళ్లినట్లు సీతారాం చెప్పారు.

# అక్రమ నాటుసారా పట్టివేత

యానాం : యానాం గిరియం పేట నుండి గాడిమొగ కు అక్రమంగా తరలిస్తున్న 70 లీటర్ల నాటుసారాను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. యానాం ఎస్ ఐ కట్ట సుబ్బరాజు తెలిపిన వివరాల ప్రకారం ఏపీ 31 టి హెచ్ 2971 ఆటోలో 70 లీటర్లు నాటుసారా ని తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుబడింది అన్నారు. ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులు పరారయ్యారని తెలిపారు. పట్టుబడిన నాటుసారాని యానాం ఎక్సైజ్ అధికారులకు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే యానం శివారు సావిత్రి నగర్ లోని ఒక ఇంట్లో 20 లీటర్ల సారా, 16 నిబ్బులు ను పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు.

# యానాంలో విజృంభిస్తున్న కరోనా వైరస్

యానాం : యానాం నియోజకవర్గంలో కరోనా వైరస్ విజృంభిస్తుంది. యానాం లో రోజు రోజుకి కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం నియోజకవర్గంలో కొత్తగా 8 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో ఓఎన్‌జిసి కి సంబంధించి ఐదు కేసులు కాగా, హైదరాబాద్ నుంచి వచ్చిన ముగ్గురికి పాజిటివ్ గా నిర్ధారణ అయింది. ఇద్దరు ప్రభుత్వ క్వారేటేన్ లో ఉండగా మరో ఐదుగురు హెూమ్ క్వారంటైన్ లో ఉన్నారు. ప్రాంతాల వారిగా దొమ్మేటి పేట లో 2, దరియాల తిప్ప 1,కురసం పేట 1, సుభద్ర నగర్ 2, గోపాల్ నగర్1, కోన స్ట్రీట్1 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. స్థానిక ప్రాంతీయ పరిపాలనాదికారి శివరాజ్ మీనా ఆయన ఛాంబర్ లో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. యానాంలో విజృంభిస్తున్న కరోనా వైరస్ నియంత్రణకు సంబంధించి తీసుకోవలసిన చర్యలపై అధికారులు తో చర్చించారు. పాజిటివ్ కేసులకు సంబంధించి,వైరస్ నివారణ కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,తదితర అంశాలను తీసుకోవలసిన చర్యలపై మీడియా సమావేశంలో తెలిపారు.

# కరోనాపై అవగాహన ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ : గొలుగొండ మండలం ఏటిగైరంపేట గ్రామంలో మంగళవారం కరోనా వైరస్ పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏటిగైరంపేట కార్యదర్శి గౌరీ ఆధ్వర్యంలో జరిగింది. ప్రతీ ఒక్కరూ భౌతిక దూరం పాటించాలని, బయటకు వచ్చేటప్పుడు మాస్కులు ధరించాలని, శానిటైజర్‌తో తరచూ శుభ్రం చేసుకోవాలని ర్యాలీగా వెళ్లి వివరించారు. అనంతరం మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

# వాలీబాల్ కిట్లు పంపిణీ



వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యూరు : వేములపూడి గిరిబాబు(మున్ను) తన జన్మదినం సందర్భంగా కొయ్యూరు, కాకరపాడు, చీడిపాలెం గ్రామాల్లో యూత్ సభ్యులకు మంగళవారం వాలీబాల్ కిట్లను స్థానిక పెద్దల సమక్షంలో పంపిణీ చేశారు. యువత క్రీడలపై దృష్టిసారించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని గిరిబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# చైతన్య చిత్రాల విరించి 'దర్శకమణి' భూషణ్



విశాఖపట్నం : నగరానికి చెందిన ప్రముఖ దర్శకుడు ఆర్.మణిభూషణ్, వృత్తి రీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయినా ప్రవృత్తిరీత్యా ఒక కళాకారుడు గా రచన, దర్శకత్వం, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ పై చిన్నప్పటి నుండి ఉన్న మక్కువ తో ఎన్నో చిత్రాలను మలచి, 1996 లోనే మద్రాస్ రే ఇన్సిట్యూట్ అఫ్ ఫిలిం టెక్నాలజీ నుండి సినిమా దర్శకత్వం లో డిప్లొమా పొంది. 1997 లో తన తొలి చిత్రం 'అడవిలో అభివృద్ధి' అనే డాక్యుమెంటరీ చిత్రాన్ని చింతపల్లి గిరిజన ప్రాంతంలో, అడవిలో జరుగుతున్న నీటి ఆధారిత వ్యవసాయం పై అవగాహనా చిత్రాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించి. ఐటిడిఏ ఇరిగేషన్ డిపార్టుమెంట్ నుండి మన్ననలు పొంది. ఆ తరువాత ఎన్నో రంగాలపై, ప్రకృతి, పర్యావరణం, పర్యాటకం, భక్తి, వాతావరణం పై సామజిక చైతన్య చిత్రాలను తీసి వారి అభి . రుచిని, సమాజం పట్ల ఉన్న భాద్యతను నిర్వ ర్తిస్తూ ఎన్నో అవార్డులు, రివార్డులు సాధించి, విశాఖ ఆణిముత్యం, సంఘమిత్ర, గురుబ్రహ్మ, విశాఖ రత్న, విశాఖ పర్యాటక ప్రోత్సాహకుడు సమాజ మిత ఇంకా మరెన్నో బిరుదులు, సమాజ మిత్ర ఇంకా మరెన్నో బిరుదులు సాధించి. 2003 లో తాను తీసిన విశాఖ అందాలు గల చూశారా విశాఖ చిత్రంతో రాష్ట్ర ప్రభుత్వ అవార్డు తో పాటు ప్రపంచ పర్యాటకులకు విశాఖ ను పరిచయం చేసి చరిత్రలో సువర్ణాక్షరాలతో తనకంటూ ఓకే పేజీని తయారుచేసుకున్న విరించి, ఎంత ఎత్తు ఎదిగిన అందరిలో ఒకరిగా, ఒదిగి ఉండే మనస్తత్వంతో విశాఖ కళాకారులకు తలలో నాలుకల... సమాజసేవ చేస్తూ ఎంతో మంది నూతన కళాకారులకు తన చిత్రాల ద్వారా అవకాశం ఇస్తూ విశాఖ కళల రాజధాని అని అభివర్ణించి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక శాఖ నుండి 4 సార్లు (2003, 2005, 2006, 2019) ఉత్తమ పురస్కారాలు పొందిన ఏకైక ఫిలిం డైరెక్టర్ మణి భూషణ్. వారి ఆలోచనలు ప్రణాళిక ఎప్పుడు సమాజాభివృద్ధికి దోహద పడేవిగా ఉంటాయి అందుకే వారు దర్శకమణి గా పిలవబడుతూ... విశాఖ నగరానికి కీర్తి తెచ్చే భూషణుడు అయ్యి తన చిత్రాల ద్వారా చైతన్యం, ఉత్తేజం కలిగిస్తున్న విశాఖ కెరటం. మరిన్ని చిత్రాల ద్వారా విశాఖఖ్యాతిని నలు దిశలా వ్యాప్తి చేయడం లో వారు ప్రధాన పాత్ర పోషించాలని. వారి స్వీయ నిర్మాణ సంస రాబ్ పొడక్షన్ హౌస్ ద్వారా నిర్మాణ సంస్థ రాబ్ ప్రొడ క్షన్ హౌస్ ద్వారా రాబోయే రోజుల్లో నిర్మించే మంచి చిత్రాలలో విశాఖ కళాకారులకు అవకాశం ఇస్తూ, ప్రోత్సహిస్తూ ముందుకు సాగాలని వారి విజయ పరంపర కొనసాగాలని అవార్డుల పంట పండాలని ఆకాంక్షిస్తూ .... 'అల్ ది బెస్ట్' దర్శకమణి భూషణ్.

# దంత సమస్యల ద్వారా టూత్‌పేస్ట్ కంపెనీలు తప్పుదారి పట్టించవద్దు

## డాక్టర్ జి.వి.శివప్రసాద్




విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ లోని వినియోగదారుల హక్కుల సంస్థ 'టూత్ పేస్ట్ కంపెనీలు మరియు దంత సమస్యల ద్వారా తప్పుదారి పట్టించవద్దు' అనే సమాచారంతో ముందుకు వచ్చింది. ఈ సెషన్లో డాక్టర్ జి.వి. శివ ప్రసాద్ - బిడిఎస్, ఎంబిఏ చీఫ్ డెంటల్ సర్జన్ రిసోర్స్ పర్సన్‌గా ఇంటరాక్ట్ అయ్యారు మరియు ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే హాజరయ్యారు. సిఆర్‌వో సభ్యులు పి.వి.జి. విశ్వనాథ్, గొర్లె శ్రీనివాస నాయుడు - రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు, నరహరిశెట్టి శ్రీధర్, కె.భరణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ శివ ప్రసాద్ ఆన్‌లైన్‌లో ఇంటరాక్షన్ చేస్తున్నప్పుడు, రోజువారీ ఆహార వినియోగం పూర్తిగా మార్చబడింది మరియు ఇటీవలి టూత్ పేస్టులను ఉప్పు, చార్ బొగ్గు, నిమ్మకాయ వంటి అదనపు రసాయనాలతో తయారు చేయబడుతున్నాయి. కాని వీటిని చాలా కంపెనీలు వినియోగదారులకూ తప్పుదారి పడుతున్నాయి. ఇంటి ఆహారం మన ఆరోగ్యానికి చాలా శ్రేయస్కరం మరియు రోజుకు రెండుసార్లు క్రమం తప్పకుండా పళ్ళు తోముకోవాలని మరియు దంత సమస్యలను నివారించడానికి నిమ్మకాయ వంటి అదనపు రసాయనాలతో తయారు చేయబడుతున్నాయి. కాని వీటిని చాలా కంపెనీలు వినియోగ దారులకూ తప్పుదారి పడుతున్నాయి.

ఇంటి ఆహారం మన ఆరోగ్యానికి చాలా శ్రేయస్కరం మరియు రోజుకు రెండుసార్లు క్రమం తప్పకుండా పళ్ళు తోముకోవాలని మరియు దంత సమస్యలను నివారించడానికి సరైన దంత లోపాలను పరీక్షలు నిర్వహించడం ద్వారా తెలుసుకోవాలని తెలియజేశారు డాక్టర్ శివ ప్రసాద్ బిడిఎస్;

ఈ కార్యక్రమం నిర్వహించిన సిఆర్‌వోను అభినందించారు. మరియు భవిష్యత్తులో కూడా అలాంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సమాచారం ఇచ్చారు మరియు సిఆర్ వోతో తన పూర్తి మద్దతును అందిస్తున్నట్లు తెలిపారు.

# హెరిటేజ్ రైతులకు ఉచిత ప్రమాద భీమా



అచ్యుతాపురం : హెరిటేజ్ పాడిరైతులకు ఉచిత ప్రమాద భీమా హెరిటేజ్ డెయిరీ అంది స్తుందని అచ్యుతా పురం శాఖ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన పాడిరైతు ఎస్ సంజీవ్ పాడి ఆవు మృతి చెందడంతో ఆయనకు మేనేజర్ కూండ్రపు శేషు రూ.30వేలు చెక్ ను మంగళ వారం అందజేశారు. ఈ సందర్భగా మేనేజర్ శేషు మాట్లాడుతు ఎటువంటి ప్రీమియం చెల్లించకుండానే పాడి రైతులకు భీమా అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సన్యాసిరావు, అప్పారావు తదితర రైతులు పాల్గొన్నారు.

# శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సహాయం



యానాం : నియోజకవర్గంలో ఇటీవల ఇద్దరు పిల్లలతో సహా ముమ్మిడి శ్రీనివాస్ గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే ఈ కుటుంబానికి స్థానిక ప్రెస్ క్లబ్ లో పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రముఖ కాంట్రాక్టర్ వంకాయలు నరేంద్ర ,సోదరుడు నర్సింగరావు బ్రదర్స్ పదివేల రూపాయలు ఆర్థికసహాయాన్ని ప్రెస్ క్లబ్ సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి లకు అందజేశారు. ప్రముఖ ప్రజాశక్తి తెలుగు పేపర్ జర్నలిస్టుగా, అనేక పేపర్ల ఏజెంటుగా గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్న శ్రీనివాస్ కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవడంతో శ్రీనివాస్ తల్లి కి ఈ ఆర్థిక సాయం అందజేస్తునట్లు నరేంద్ర తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాత్రికేయుల సంఘ అధ్యక్షులు దున్న చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి లంక వెంకన్నబాబు, అధ్యక్షులు బద్రి, వెంకటేష్, గంగా ప్రసాద్, అశోక్ కుమార్,జాజి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ ప్రదాత డా. వైఎస్ఆర్ జయంతి (జూలై 8)



ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ వేదికపై అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తులలో డా. వై ఎస్ రాజశేఖర రెడ్డి ఒకరు. అహంలేని వ్యక్తిత్వం కొందరికే చెల్లుతుంది. అలా జన్మించి జనం గుండెల్లో చిరకాలం గుర్తుండేలా గూడుకట్టుకున్న మహోన్నత వ్యక్తి యై ఎస్ రాజశేఖర్ రెడ్డి. ఈయన పూర్తిపేరు ఏడుగురి సందింటి రాజశేఖర్ రెడ్డి. ఈయన జూలై 8,1949 లో రాజారెడ్డి,జయమ్మ దంపతులకు జమ్మలమడుగు మిషన్ ఆసుపత్రిలో జన్మించారు. ఈయన స్వస్థలం బలపనూరు. ఈయన విద్యాభ్యాసం కడప జిల్లా పులివెందుల లో ప్రారంభమైంది. కర్ణాటక లోని బళ్ళారి లో హై స్కూల్ చదువు, విజయవాడ లయోలా కళాశాలలో పి యు సి, గుల్బర్గా లోని ఎం.అర్.మెడికల్ కళాశాలలో మెడికల్ విద్యను అభ్యసించారు. ఎస్.వి.కళాశాల తిరుపతి లో హౌస్ సర్జన్ గా చేశారు. సహజ సిద్దంగా నాయకత్వ లక్షణాలున్న వైఎస్ మెడికల్ కళాశాల విద్యార్థి సంఘం నాయకుడిగా ఎన్నికైనారు. ఇది ఆయన రాజకీయ ప్రస్థానానికి తొలి మెట్టు. 1975 లో యువజన కాంగ్రెస్ నాయకుడిగా రాజకీయ రంగంలోకి అరంగేట్రం చేశారు. 1978 లో తొలిసారిగా పులివెందుల నుండి రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆవు - దూడ గుర్తుపై పోటీచేసి విజయం సాధించారు. తరువాత ఇందిరా కాంగ్రెస్ లోకి మారారు. వీరి జీవితకాలంలో మొత్తం ఆరు పర్యాయాలు శాసన సభ్యులు గా, నాలుగు సార్లు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైనారు. రెండు సార్లు పి సి సి అధ్యక్షునిగా పనిచేశారు. ఒక డాక్టర్ గా వంద మందికి సేవ చేసే భాగ్యం కలుగుతుంది, కానీ రాజకీయ రంగంలో లక్షలాది ప్రజలకు సేవ చేసే భాగ్యం లభిస్తుంది కాబట్టే రాజకీయాలలోకి వచ్చినట్లు ఆయన చెప్పేవారు. నిజానికి 1969లో ఇందిరాగాంధీ చేపట్టిన బ్యాంకుల జాతీయకరణ ఆయన్ని అమితంగా ఆకర్షించింది. కాంగ్రెస్ వైపు దృష్టి మరల్చేలా చేసింది. స్నేహితులం టీ ప్రాణంగా భావించే వైఎస్ కి గుల్బర్గా మెడికల్ కళాశాలలో జరిగిన ఒక సంఘటన అతనికి మంచి స్నేహితున్ని ఇచ్చింది. ఆయనే కే.వి.పి.రామచంద్రరావు. వీరిద్దరిదీ ఒకే ఆత్మ ,దేహాలు వేరు అనేంతలా ఉండేవారు. 1980 లో టంగుటూరి అంజయ్య మంత్రి వర్గంలో తొలి సారిగా మంత్రి పదవి చేపట్టారు. 1980-82 లో గ్రామీణాభివృద్ధి శాఖామంత్రిగా, 1982 భవనం వెంకట్రామరెడ్డి మంత్రి వర్గంలో అబ్కారీ, 1982-83 కోట్ల విజయ భాస్కర్ రెడ్డి మంత్రి వర్గంలో విద్యాశాఖ మంత్రిగా చేశారు. తను అనుకున్నది ఎంతటి కష్టమైనా, ఎంతటి నష్టమైనా సాధించాలనే పట్టుదల, తపన గల విశిష్ట వ్యక్తిత్వం గలిగిన వ్యక్తి వైఎస్సార్. కుల రహిత, మత రహిత సమాజం కోసం అహర్నిశలు కష్టపడిన వ్యక్తి వైఎస్సార్. 1999-2004 కాలంలో వైఎస్సార్ ఆంధ్రప్రదేశ్ శాసన సభలో ప్రతిపక్ష నాయకుడు గా పనిచేశారు . 2003 లో ఈయన ప్రారంభించిన "ప్రజా ప్రస్థానం" చరిత్రలో లిఖించబడినది. చేవెళ్ల నియోజకవర్గం నుండి శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం వరకు 1476 కిలోమీటర్ల దూరం పాదయాత్ర నభూతో నభవిష్యత్ అన్నట్లు జరిగింది. మండుటెండల్లో 68 రోజుల పాటు 11 జిల్లాల గుండా సాగిన ఈ ప్రజా ప్రస్థానం పాదయాత్రలో డా.వైఎస్సార్ తలపాగా, పంచె కట్టుతో తెలుగు సంప్రదాయం. తో నేరుగా ప్రజలతో అనుసంధానమై వారి కష్టాలు వింటూ వారికి భరోసా కల్పిస్తూ రాబోయే ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలంతా సుఖంగా , సంతోషంగా జీవిస్తారని తెలుపుతూ కొనసాగిస్తున్నారు. 2004 జరిగిన శాసనసభ ఎన్నికల్లో వైఎస్సార్ నేతృత్వం లోని కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించింది. ఏప్రిల్15, 2004 న ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా దా వైఎస్సార్ ప్రమాణ స్వీకార చేశారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే తాను ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీ అమలుకై తొలి సంతకం చేసి తన చిత్తశుద్ధి నీ నిరూపించుకున్నారు. తన పరిపాలన ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కొనసాగించారు. జలయజ్ఞం, ఆరోగ్య శ్రీ, కిలో బియ్యం రెండు రూపాయలకు, ఫీజు రీయింబర్సమెంట్, పావలా వడ్డీ, పారిశ్రామిక అభివృద్ధి ఇలా అనేక రంగాల్లో తన ముద్రను మిగిల్చారు వైఎస్సార్. అధికారంలోకి రాగానే రైతుల రుణాలను మాఫీ చేశారు. పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్ధిదారులు గా ఉండాలని ఆయన చెప్పేవారు. తాను ఇచ్చిన హామీలను , అమలు చేసిన విధానాన్ని

చూసి 2009 ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించిన మని 2009 లో ప్రజల వద్దకు వెళ్లారు వైఎస్సార్. తిరిగి విజయం సాధించి రెండవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రం నుండి 33 మంది ఎం పి లను అందించి కాంగ్రెస్ హై కమాండ్ వద్ద తిరుగులేని అభిమానం సంపాదించుకున్నారు. 2004 లో రాజీవ్ పల్లెబాట, 2005 లో రాజీవ్ నగరబాట వంటి ప్రజాహిత కార్యక్రమాల ద్వారా ప్రజల్లో బాగా మమేకమై పోయారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా కల్పించడం లో వైఎస్సార్ పాత్ర శ్లాఘనీయం. అసంఖ్యాక ప్రజలకు నేరుగా సేవలందించడానికి రాజకీయాలే మార్గమని చిన్నప్పుడు వెంకటప్పయ్య మాస్టర్ చెప్పిన మాటలు రాజశేఖర్ రెడ్డి నీ రాజకీయాల వైపు మళ్లించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు తెలుసుకోవడానికి ఉద్దేశించబడిన కార్యక్రమం రచ్చ బండ లో పాల్గొనడానికి 2009, సెప్టెంబర్ 2 న చిత్తూరు కు వెళ్ళవలసిన వైఎస్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో నల్లమల అటవీ ప్రాంతంలో పావురాల్ల గుట్ట వద్ద కూలిపోయింది. సెప్టెంబర్ 3 హెలికాప్టర్ ఆచూకీ గుర్తించిన అధికారులు అందులో గుర్తించడానికి సైతం వీలు లేకుండా కాలి పోయిన మృత దేహాలను చూసి నిర్ఘాంత పోయారు. దేశం మొత్తం డా.వైఎస్సార్ మరణంతో తల్లడిల్లింది. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయన ప్రవేశ పెట్టిన పథకాల రూపంలో ఎప్పటి నిలిచుండి పోతారు.

పేద ప్రజల దేవుడు వైఎస్సార్.

## అధిక రుసుము వసూళ్లు చేస్తున్న మీ సేవ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి



ములగాడ : మండలం పరిధిలో కుల ధ్రువీకరణ పత్రాల నమోదుకు అధిక రుసుము వసూళ్లు చేస్తున్న మీ సేవ కేంద్రాలపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పశ్చిమ నియోజకవర్గ సంఘ సేవకులు పెదరెడ్ల నానాజీ ములగాడ తహశీల్దార్ రమామణిని కోరారు. ఈ మేరకు మంగళవారం విశాఖ అర్బన్ జిల్లా ములగాడ తహశీల్దార్ రమామణిని కలిసి సమస్యను వివరించి, నిర్వహకులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రవేశపెట్టిన ప్రతి పథకానికి కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమవుతుండడంతో నమోదుకు మీ సేవా కేంద్రాలను దరఖాస్తు దారులు ఆశ్రయిస్తున్నారని, అయితే ఇదే అదునుగా అడిగేవారు లేరని మీ సేవా కేంద్రాల నిర్వాహకులు అధిక రుసుము వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నారు. పారిశ్రామికప్రాంతంలో 7వార్డులలో మీ సేవ కేంద్రాలలో 45రూపాయలు తీసుకుని ఇవ్వవలసిన కులధ్రువీకరణ పత్రాలకు 100 రూపాయిలు వసూళ్లు చేస్తున్నారని ఇది పేదవారికి అధిక భారమని ఆందోళన వ్యక్తం చేసారు.

ఇటువంటి వసూళ్లు చేస్తున్న వారిపై తగుచర్యలు తీసుకోవాలని కోరుతూ ములగాడ తహసీల్దార్ రమామణికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

ఈ విషయం పై తహశీల్దార్ దృష్టి పెట్టాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో జిల్లా తెలుగుయువత కార్యదర్శి పోతాబత్తుల శ్రీనివాస్, దళితనాయకులు శంకర్ రావు, చిన్న,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో లక్ష కరోనా పరీక్షలు పూర్తి : జిల్లా కలెక్టర్ జె.నివాస్

శ్రీకాకుళం : జిల్లాలో లక్ష కోవిడ్ 19 పరీక్షలు పూర్తి అయ్యాయి. జిల్లా యంత్రాంగం కోవిడ్ నివారణలో చేపట్టిన చర్యల్లో భాగంగా లక్ష పరీక్షలు పూర్తి చేసంది. ప్రపంచాన్ని పీడిస్తున్న కోవిడ్ మహమ్మారిని జిల్లాలోకి ప్రవేశించుకుండా జిల్లా కలెక్టర్ జె.నివాస్ మార్గదర్శకత్వంలో జిల్లా యంత్రాంగం మొదటి నుండి అనేక కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. రాష్ట్ర ముఖ్య మంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అధికంగా పరీక్షలు నిర్వహించడం వలన కేసులను త్వరగా గుర్తించ వచ్చనే సూత్రాన్ని పాటిస్తూ జిల్లాలో పరీక్షల నిర్వహణకు శరవేగంగా చర్యలు చేపట్టారు. జిల్లాలో మార్చి 5న మూడు నమూనాల సేకరణతో ప్రారంభమైన కరోనా పరీక్షలు మార్చి 30వ తేదీకి రెండు అంకెల దశకు చేరుకుంది. ఏప్రిల్ 4వ తేదీ నుండి దిన దిన ప్రవర్ధమానంగా సాగుతూ రెండు రోజుల్లోనే, ఏప్రిల్ 6వ తేదీన 144 నమూనాలు సేకరించి సెంచరీ రికార్డును సాధించింది. 16వ తేదీన 184 నమూనాలు సేకరించగా 17వ తేదీన 395 నమూనాలు సేకరించే స్థాయికి చేరింది. 20వ తేదీకి 5వందల మార్కుకు చేరుకుంది. మే 4 నాటికి రోజుకు వెయ్యి నమూనాలు సేకరించే స్థాయికి చేరి మొత్తం 10,541 నమూనాలు సేకరించి పరీక్షించడం జరిగింది. మే 9వ తేదీ నాటికి 15 వేల మార్కు, మే 13 నాటికి 20 వేల మార్కు, మే 17కి 25 వేల మార్కు, మే 21 నాటికి 30 వేలు, మే 31 నాటికి 45 వేల మార్కు దాటింది. జూన్ 3వ తేదీ నాటికి 50 వేల మార్కు దాటింది. మూడు నెలల వ్యవధిలో 50 వేలు నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించిన యంత్రాంగం నెల రోజుల వ్యవధిలో మరో 50 వేల పరీక్షలు నిర్వహించిన ఘనత దక్కించుకుంది. జూన్ 9 నాటికి 60 వేల మార్కు, జూన్ 24 నాటికి 75 వేల మార్కు, జూలై 7వ తేదీ నాటికి లక్ష నమూనాలు సేకరించి రికార్డు సృష్టించడం జరిగింది.

# ఘనంగా మంత్రి ధర్మాన కృష్ణదాస్ జన్మదిన వేడుకలు



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు మంత్రి కి సాదర స్వాగతం పలికారు. అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. దేవాలయంలో ఎంతో విశిష్టమైన కప్ప స్తంభాన్ని మంత్రి ఆలింగనం చేసుకున్నారు.



శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారిని మంగళవారం నాడు రహదారులు మరియు భవనాలు శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ పుట్టిన రోజు సందర్భంగా స్వామి ని దర్శించుకున్నారు సింహగిరి కి మంత్రికి ఆలయ ఈ ఓ డీ భ్రమరంబ సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలుకగా కప్పస్తంబ ఆలింగనం అనంతరం స్వామివారిని దర్శించు కోగా లక్ష్మీ అమ్మవారి దర్శనము అనంతరం వీరికి స్వామి వారి ప్రసాదం అందజేశారు వీరి వెంట 98 వ వార్డ్ వైసీపీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు

## జగన్ అన్నకు తోడుగా.... కార్యకర్తలకు అండగ ధర్మాన కుటుంబం




నరసన్నపేట: రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ జన్మదినోత్సవ వేడుకలను నరసన్నపేట నియోజకవర్గ కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసన్నపేట నియోజకవర్గ యువ నాయకుడు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య ముఖ్య అతిథిగా హాజరై అభిమానులు ఏర్పాటు చేసిన ప్రత్యేక భారీ కేకును కట్ చేసి పుట్టిన రోజు వేడుకలను ప్రారంభించారు. అనంతరం నరసన్నపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరంగి మురళీధర్ కేక్ ను డాక్టర్ కృష్ణ చైతన్య కు తినిపించి తమ ప్రియతమ నాయకుని పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ధర్మాన అభిమానులను ఉద్దేశించి డాక్టర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాటు నరసన్నపేట రాజకీయాలలో తమదైన ముద్ర వేసుకున్న మన కృష్ణ దాస్ నమ్మిన సిద్ధాంతాన్ని విడువక పార్టీకి విధేయుడుగా ఉంటూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న ఘనత ధర్మాన కృష్ణదాస్ కి దక్కిందని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఎన్ని ప్రలోభాలు పెట్టినా, ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా భయపడక ప్రజాక్షేత్రంలో పోరాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్రెడ్డి ఆశీర్వాదంతో ప్రజల అందరి దీవెనలతో రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రిగా తమ సేవలను నిరంతరం ప్రజలకు అందిస్తున్నారని ఆయన సేవలను కొనియాడారు.

అనంతరం నరసన్నపేట గవర్నమెంట్ హాస్పిటల్ వారి సౌజన్యంతో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 100 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయ ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణ నిమిత్తం మొక్కలు నాటారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నా నా దాలినాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరంగి మురళీధర్, కె సి హెచ్ బి గుప్తా, కోపరేటివ్ ఉపాధ్యక్షుడు కింతలి చలపతిరావు, బూరెల శంకర్, సు రంగి నర్సింగరావు, రాజాపు అప్పన్న, మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, ధర్మాన యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# వెంకటాపురం గ్రామ శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంఖుస్థాపన

## - రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి వర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విశాఖపట్నం :- వెంకటాపురం గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు, గ్రామానికి చెందిన శ్మశానవాటిక సంబందించి 66.00 లక్షల రూపాయల కార్పొరేషన్ నిధులతో కమీషనర్ డా. జి. సృజన తో కలసి పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి వర్యులు ముత్తంశెట్టి శ్రీనివాస రావు (అవంతి) శంఖుస్థాపన చేసారు. ఇంకనూ గ్రామంలో గల ఎం. పి. పి. పాఠశాల భవనానికి రూ. 3.00 లక్షల వ్యయంతో రిపేర్లు చేపట్టే పనిని ప్రారంభించారు. ఈ భవనాన్ని 10 బెడ్ల ఆసుపత్రిగా వాడుకునే నిమిత్తం జిల్లా వైద్యశాఖాధికారికి అప్పజెప్పనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన రెడ్డి గారు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజాభీష్ట పాలన సాగిస్తున్నారని కొనియాడారు. జి.వి.ఎం.సి. కమీషనర్ డా. జి. సృజన మాట్లాడుతూ, రాబోయే కాలంలో ప్రభుత్వ సహాయంతో, నగర పరిధిలో మరిన్ని మౌళిక సదుపాయాలు కల్పించడానికి కృషిచేస్తున్నా మన్నారు. ఇంకనూ ఈ కార్యక్రమంలో, జాయంట్ కలక్టర్ అరుణ్ బాబు, రెవెన్యూ డివిజనల్ అధికారి పి. కిషోర్, జిల్లా వైద్యశాఖాధికారి డా. తిరుపతి రావు, ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సుధాకర్, జి.వి.ఎం.సి. సి.ఎం.ఓ.హెచ్. డా. కె.ఎల్.ఎస్.జి. శాస్త్రి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డా. దవళ భాస్కర రావు, జి.వి.ఎం.సి. పర్యవేక్షక ఇంజినీర్ డా. శివ ప్రసాదరావు, జొనల్ కమిషనర్ తో పాటు ఇతర జోనల్ స్థాయి అధికారులు, స్థానిక ప్రజానాయకులు మొదలగు వారు పాల్గొన్నారు.



రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావుని మర్యాద పూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛం మంత్రి కి అభినందనలు తెలియజేసిన విశాఖపట్నం జిల్లా ఎస్.పీ బొడ్డేపల్లి కృష్ణారావు, జిల్లా లో శాంతి భద్రతల పరిరక్షణ లో రాజీ పడేది లేదని ఎస్పీ బొడ్డే పల్లి కృష్ణారావు తెలిపారు.

# ప్రతీ ఒక్కరు గిరిజన సంక్షేమానికి అభివృద్ధికి కృషి చేయాలి

## ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పాముల పుష్పశ్రీవాణి



పాడేరు : ప్రజా ప్రతినిధులు, అధికారులు గిరిజన సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మాత్యులు శ్రీమతి పాముల పుష్ప శ్రీవాణి స్పష్టం చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన రెడ్డి గిరిజన పక్షపాతి అన్ని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాలు నెరవేర్చాలని సూచించారు. మంగళవారం ఐటిడి ఏ ప్రాజెక్టు అధికారి డా. వేంకటేశ్వర్ సలిజాముల అధ్యక్షతన ఐటిడి ఏ సమావేశ మందిరంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకాకపోత కఠిన చర్యలు తీసుకోవాలని అదనపు జిలా వైద్యాధికారిని ఆదేశించారు. వైద్య సేవలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. స్థానిక శాసన సభ్యులు తన దృష్టికి తీసుకుని వచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మన బడి నాడు నేడు పనులలో నాణ్యతలు పాటించకపోతే ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం నిర్మాణ సామగ్రి కొనుగోలు చేయాలని అవతవకలకు పాల్పడకుండా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. పాడేరు శాసన సభ్యులు సూచనల మేరకు సి ఆర్ టిల సమస్యలను , జి. ఒ. నెం. 3 పై న్యాయ నిపుణుల సలహాలు తీసుకుని ముందుకు వెళతామన్నారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలన్న సూచనలు పరిగణలోకి పరిశీలిస్తామన్నారు. విద్యావిభాగంలో ఉన్న అనవసర డిప్యూటేషన్లు రద్దు చేయాలని ఆదేశించారు. అసుపత్రుల అంబులెన్సులకు అదనపు డ్రైవర్లను నియమించాలని అరకు శాసన సభ్యులు చెట్టి పాల్గుణ మంత్రి దృష్టి కి తీసుకుని వచ్చారు. అదనపు అంబులెన్సు డ్రైవర్లను నియమించాలని ఐటిడి ఏ పి ఓ కు సూచించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు సమర్ధవంతంగా పనిచేయాలన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. సోలార్ పంపలు నిర్వహణ బాధ్యత సంబంధిత కాంట్రాక్టరుపైనే ఉందన్నారు. సక్రమంగా నిర్వహించకపోతే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని చెప్పారు. మురుగుకాలువలను నూరు శాతం పూడిక తీత చేపట్టాలన్నారు. గిరిజన రైతులకు చెందాల్సిన రైతు భరోసా ప్రతీ ఒక్కరికి అందించాలన్నారు. గిరిజనులకు ప్రయోజనం చేకూర్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 2016-17 నుంచి ట్రైకార్ లో మంజూరు చేసిన పధకాలు క్షేత్ర స్థాయిలో ఉన్నది లేనిది తనిఖీ చేసి నివేధిక సమర్పించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో అరకు ఎం.పి. జి.మాధవి, పాడేరు , అరకు శాసన సభ్యులు కె. భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, జిసిసి ఎం.డి ,పి. ఏ . శోభ వివిద శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజీ ఘటనలో ఇద్దరు డైరెక్టర్లుతో సహా 12మంది అరెస్ట్



విశాఖపట్నం : ఎల్జీపాలిమర్స్ సీఈవో సున్‌కే జియాంగ్, డైరెక్టర్ డీఎస్ కిమ్ అరెస్ట్.. అడిషనల్ డైరెక్టర్ మోహన్‌రావు, కొందరు డైరెక్టర్లు... స్టైరిన్ మోనోమార్ ఇంజినీర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు. ఎల్జీ పాలిమర్స్‌పై 278, 284, 285, 304, 337, 338 సెక్షన్ల కింద కేసు నమోదు గ్యాస్ లీకేజీ ఘటనలో 12మంది మృతి, 585మందికి అస్వస్థత ఘటనపై విచారణ జరిపి నివేదిక ఇచ్చిన హైపవర్ కమిటీ. ఎల్జీ పాలిమర్స్ నిర్వహణలో లోపాలు ఎత్తి చూపిన హైవపర్ కమిటీ, ప్రమాదానికి, యాజమాన్యం, నిర్వహణ లోపం అని తేల్చిన కమిటీ

# కోవిడ్ బాధితులతో ఆళ్ల నాని వీడియో కాన్ఫరెన్స్

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని మంగళవారం కోవిడ్ బాధితులు ఉన్న ఆసుపత్రులతో విజయవాడలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, ఆహారం, మంచినీరు ఎలా అందిస్తున్నారని స్వయంగా పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. నాని అడిగిన ప్రశ్నలకు పేషెంట్లు స్పందిస్తూ... 'ఆసుపత్రుల్లో కోవిడ్ బాధితులకు అద్భుతమైన సేవలందిస్తున్నారు. సమయానికి మందులు ఇస్తూనే ఎప్పటికప్పుడు శానిటైజేషన్ నిర్వహిస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. భోజనం , టిఫిన్ సమయానికి అందిస్తున్నారు. మంచి నాణ్యత గల పౌష్టిక ఆహారం అందిస్తున్నారు. కోవిడ్ పేషెంట్లకు ప్రభుత్వం అద్భుతంగా సేవలందిస్తోంది.మంచి ఆహారం.. నీరు అందిస్తున్నారు.మాకు ఎటువంటి ఇబ్బంది లేదు' అంటూ తెలిపారు.






# మూడో దశకు చైనా వ్యాక్సిన్!

లండన్: కరోనావైరస్‌ను ఎదుర్కోవడం కోసం చైనా సినోవాక్ బయోటెక్ తయారుచేస్తోన్న వ్యాక్సిన్ మూడో దశకు చేరుకున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ మూడో దశ ట్రయల్స్ బ్రెజిల్‌లో ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. కొవిడ్-19 వ్యాక్సిన్ కోసం చైనా కంపెనీ సినోవాక్ బ్రెజిల్‌కి చెందిన వ్యాక్సిన్ తయారీదారు 'ఇన్‌స్టిట్యూటో బూటాన్‌టన్'తో కలిసి పనిచేయనుంది. దీనిలోభాగంగా జులైలో మూడోదశ ట్రయల్స్ ప్రారంభించడానికి దాదాపు 9వేల మంది ఆరోగ్యకార్యకర్తలను నియమించుకోనుంది. జనవరి చివరలోనే కరోనా వ్యాక్సిన్ తయారీని ప్రారంభించిన సినోవాక్ బయోటెక్ కొవిడ్ వ్యాక్సిన్ ప్లాంటును సిద్ధం చేస్తోంది. సంవత్సరానికి పదికోట్ల డోసులను తయారుచేసే సామర్థ్యం కలిగిన ఈ ప్లాంటు ఈ సంవత్సరం చివరినాటికి పూర్తికానుంది.

ఇప్పటికే ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తయారుచేసిన వ్యాక్సిన్‌తోపాటు 'చైనా జాతీయ ఫార్మా బృందం(సినోఫార్మ్)' తయారుచేసిన వ్యాక్సిన్‌లు మూడోదశ ప్రయోగస్థాయికి చేరుకున్నాయి. మరో సంస్థ మోడెర్నా కూడా ఈ నెలలోనే తుది దశ ప్రయోగాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.











VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com